లోపలి పేజీల్లో
ప్రయోగం ప్రయోజనం 8-9లో
కొండల్లో ఇళ్లంట.. ప్రపంచంలో మిన్నంట!! 14లో

ఈనాడు
జగిత్యాల
గురువారం 17 ఆగస్టు 2017
16 పేజీలు


కస్తూర్బాలలో బాలికల తల్లులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ శరత్ ఆకస్మిక తనిఖీలు
ఇద్దరి సస్పెన్షన్, మరో ఇద్దరికి శ్రీముఖాలు

సారంగాపూర్, జగిత్యాల, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పేర్కొన్నారు. బుధవారం సారంగాపూర్ మండలంలోని రంగపేట ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సారంగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సారంగాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి విధులకు తరచూ గైర్హాజరైన సీనియర్ సహాయకుడు పురుషోత్తంను సస్పెండ్ చేయగా, మరో ఇద్దరు ఆరోగ్యశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని రోగులు కూర్చొనే బల్లలపై సామగ్రి ఉంచడం, పరుపులను సంచుల్లోనే ఉంచడంతోపాటు విధులకు సరిగా హాజరు కాకపోవడంపై సీహెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలను నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. భోజన వివరాలను, తాగునీటి పరిశుభ్రతను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న బాలికల మిగతా2లో..

పత్తాలేని పారిశ్రామికాభివృద్ధి
అనువైన పరిస్థితులున్నా ఏర్పాటుకాని పరిశ్రమలు
జిల్లాలో యువతకు కొరవడుతున్న ఉపాధి



వనరులు అపారం.. మంజూరులో తాత్సారం

ఓ వైపు రామగుండంలోని ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ పూర్తయింది. కొన్నినెలల్లోనే యూరియా ఉత్పత్తిని చేపట్టనుండగా మరోవైపు జగిత్యాల జిల్లాలోని ప్రధాన పరిశ్రమయైన ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని తెరిపించే పరిస్థితిని ప్రభుత్వం పరిశీలించడం లేదు. ఈ నేపథ్యంలో పెద్ద, చిన్నపరిశ్రమలపై సర్కారు శీతకన్నుతో పారిశ్రామికవృద్ధి పత్తా లేకుండా పోతోంది. అన్ని రంగాల్లో పురోగతితోనే సమతూక అభివృద్ధి సాధ్యపడే పరిస్థితులున్నా కేవలం వ్యవసాయ ఉత్పత్తులకే జగిత్యాల జిల్లా పరిమితమవుతోంది. ఉప ఉత్పత్తులుగా అధిక ధరలకు పంటలను అమ్మలేక అన్నదాతలు అవస్థలు పడుతుండగా పారిశ్రామికీకరణ లేనందున యువతకు ఉపాధిమార్గాలు మృగ్యమవుతున్నాయి.

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే

జిల్లాల పునర్విభజన అనంతరం భారీ మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమల్లో సింహభాగం ఇతర జిల్లాల్లోకి వెళ్లగా జగిత్యాలలో కేవలం రెండు మాత్రమే భారీ పరిశ్రమలు 81 చిన్నతరహా పరిశ్రమలు మిగిలాయి. జిల్లాలోని మొత్తం జనాభా 9,85,417 మంది ఉండగా ఇందులో రైతులే 1,54,555 (సమగ్ర రైతుసర్వే ప్రకారం) మంది ఉన్నారు. జిల్లాలో పట్టణాల్లో 2,21,336 మంది ఉండగా గ్రామాల్లో 7,64,081 మంది ఉన్నారు. కానీ వీరిలో పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నవారు కేవలం 1,189 మంది మాత్రమే ఉండటం పారిశ్రామిక లోటును వెల్లడిస్తోంది. జిల్లాలో శ్రామికులు, ఉద్యోగులు 5,36,436 మంది ఉండగా వ్యవసాయ కార్మికులు 1,77,530 ఉన్నారు. జిల్లాలో అక్షరాస్యత 60.26 శాతమున్నా, అత్యధికంగా 91,947 హెక్టార్ల శ్రీరామ్‌సాగర్ ఆయకట్టున్నా ఇన్నాళ్లూ పారిశ్రామికంగా పెద్దగా అభివృద్ధి సాధించలేదు. జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేటలో 1980లో ప్రభుత్వం స్థాపించిన చక్కెర కర్మాగారం మూతపడగా జిల్లాలో 15 వేల ఎకరాలున్న చెరకుసాగు పరిశ్రమ సంక్షోభంతో 200 ఎకరాలకు తగ్గింది. పరిశ్రమపై ఆధారపడిన ఉద్యోగులు, కూలీలు, రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జగిత్యాల మండలం తాటిపల్లి శివారులో సోయాబీన్ ఆయిల్ కర్మాగారాన్ని ప్రయివేటులో నిర్మించగా గత జనవరిలో ఉత్పత్తిపై మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చర్యలకు ఆదేశించినా ఇప్పటికీ ప్రారంభంకాలేదు. మొత్తానికి జిల్లాలోని రెండు భారీ పరిశ్రమల్లో రూ. 39.81 కోట్ల పెట్టుబడులుండగా కేవలం 409 మందికి ఉపాధిగా ఉంది. జిల్లాలో 81 చిన్నతరహా పరిశ్రమలు ఉండగా వీటిల్లో రూ. 50.23 కోట్ల పెట్టుబడులుండగా 780 మందికి మాత్రమే ఉపాధి లభిస్తోంది.

అరకొరగా దరఖాస్తులు

జిల్లాలో పెద్దఎత్తున జనాభాఉన్నా ఈ మధ్య కాలంలో జిల్లాలో 50 మంది మిగతా2లో..


అర్పపల్లి పాఠశాలలో బీరువాలోనే ఉన్న రేడియో

దూరం.. 'మీనా ప్రపంచం'

వినిపించని రేడియో పాఠాలు   అటకెక్కిన టీవీలు

బీర్‌పూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విజ్ఞానంతో పాటు సృజనాత్మకతను పెంపొందించేందుకు రేడియో, టెలివిజన్, డిజిటల్ తరగతుల ద్వారా విద్యా బోధన అందిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పాఠశాలల్లో ఆధునిక బోధన అందక అందించిన పరికరాలు నిరుపయోగంగా మారుతున్నాయి. జగిత్యాల జిల్లాలోని 18 మండలాల్లో 1208 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో 1,50,308 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో చదువుకుంటున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతోపాటు విషయాన్ని సులభంగా అర్థం చేయించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో 'విందాం.. నేర్చుకుందాం', మీనా ప్రపంచం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. రేడియో పాఠాలు ప్రారంభం కాకపోవడంతో రేడియోలను మూలన పడేశారు. ఇప్పటి వరకు



రేడియో పాఠాలపై ఎలాంటి ప్రణాళిక తయారు చేయకపోవడంతో వాటిని బీరువాల్లో భద్రపరచగా, కొన్ని పాఠశాలల్లో అసలు రేడియోలు పనిచేయడమే లేదు.

రేడియో పాఠాలతో బట్టీ విధానానికి స్వస్తి

ప్రతి రోజు బోధించే రేడియో పాఠాల ద్వారా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుని పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన పనిలేకుండా పోతుంది. పాఠాలను విందాం.. నేర్చుకుందాం, మీనా ప్రపంచం కార్యక్రమాల ప్రసారం కోసం రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ ద్వారా పాఠ్య ప్రణాళికలను తయారు చేస్తుంది. యూనిసెఫ్ సహకారంతో మీనా ప్రపంచం పేరుతో రేడియో కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఇందులో కథ రూపంలో విద్యార్థులకు బాలల హక్కులు, పాఠశాలల పరిశుభ్రత, లింగ వివక్ష, ఆరోగ్యం, స్నేహపూరిత వాతావరణంలో పాఠశాలలో కొనసాగింపుతోపాటు పలు అంశాలపై రేడియో పాఠాల ద్వారా బోధిస్తారు. ప్రస్తుతం పాఠాలు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థుల మీనా ప్రపంచానికి దూరమవుతున్నారు. ప్రస్తుత విద్యాశాఖ నుంచి ఏదో కార్యక్రమం అమలవుతున్నా.. పాఠశాల స్థాయిలో వాటిని ఉపాధ్యాయులు వినియోగించకుండా పక్కకు పడేశారు.


పాఠశాలలో మూలన ఉన్న టీవీ

పాఠశాలల్లో మూలన పడ్డ టీవీలు

ప్రభుత్వం డిజిటల్ తరగతుల బోధనకు ముందు పలు పాఠశాలలకు మిగతా2లో..

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

తల్లులతో మాట్లాడి కస్తూర్బా వసతులు, బోధనపై అడిగి తెలుసుకున్నారు. విద్యాలయం ఆవరణలో ఖాళీ ప్రదేశం ఉన్నందున హరితహారంలో మొక్కలను నాటి సంరక్షణ చేపట్టేలా చూడాలని కోరారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి లక్ష్యం సాధన కోసం నిరంతరం శ్రమించాలని బాలికలకు సూచించారు. మండలంలోని రంగపేటలో నిర్మిస్తున్న రెండు పడక గదుల నిర్మాణం పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.



రంగపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ శరత్

అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి చదువులో వెనకబడిన విద్యార్థులను ఇప్పటి నుంచే గుర్తించి వారికి ప్రత్యేక బోధన ఇవ్వాలని, డిజిటల్ తరగతుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలకు సరిగా పౌష్టికాహారం అందించకపోవడమే కాకుండా రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో పాటు చిన్నారులకు అందించే కోడిగుడ్లను సరిగా అందించకపోవడంపై అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మంజులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శరత్ ఆకస్మిక తనిఖీలు చేయడంతో మండలంలోని అధికారులు ఎక్కడికి వస్తారో తెలియక పరుగులు తీయాల్సి వచ్చింది.

135 మంది ఉద్యోగులకు మెమోలు

జిల్లాలో విధుల్లో నిర్లక్ష్యం చూపిన 135 మంది అధికారులు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ మెమోలు జారీ చేశారు. బుధవారం హరితహారంలో విధిగా పాల్గొనాలన్న నిబంధన ఉన్నప్పటికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా 15 మంది గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, 120 మంది మొక్కలు నాటే ప్రదేశాల బాధ్యులు విధులకు హాజరు కాలేదని తేలింది. వారందరికి తాఖీదులిచ్చి ఇక ముందు నిర్లక్ష్యం చూపితే తీవ్రంగా పరిగణించాల్సి వస్తోందని హెచ్చరించారు.

ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు

జిల్లాలో ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ చెప్పారు. బుధవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అన్ని శాఖల్లో సమూల మార్పులు తెస్తామని చెప్పారు. వారంలో ఒకరోజు మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో ప్రతి మండలంలో మూడు గ్రామాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని పాఠశాల, అంగన్‌వాడీ, చౌకధరల దుకాణం, అభివృద్ధి పనులను పరిశీలించి సాయంత్రం తనకు నివేదిక ఇస్తారని ఏయే గ్రామాలు, ఏయే శాఖలు పరిశీలించేది తనిఖీలకు వెళ్లే రోజు ఉదయం 9 గంటలకు సమాచారం ఇస్తామన్నారు. తాను కూడా ఏదో ఒక మండలం ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తానని విధుల్లో నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని చెప్పారు. బుధవారం జిల్లాలోని అన్ని మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ జరిగిందని 60 శాతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఉండటం లేదని, రికార్డుల నిర్వహణ సరిగ్గా లేదని తనిఖీ అధికారుల నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిగా పరిస్థితి మారాలని గ్రామీణ ప్రజలు ఏ సమయంలో వచ్చినా మెరుగైన వైద్య సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శరత్ చెప్పారు.

వసతిగృహ నిర్వాహకుల జిల్లా కార్యవర్గం

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని బీసీ వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షునిగా ఎం.వెంకట్‌రెడ్డి, సహ అధ్యక్షునిగా ఆర్.భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ పద్మావతి, ఆర్.మహేందర్, కోశాధికారిగా ఎం.భద్రయ్య, సంయుక్త కార్యదర్శిగా కె.శారద, టి.శ్రీలత, నిర్వాహక కార్యదర్శిగా ఎస్.వేణుగోపాల్, ప్రచార కార్యదర్శిగా జి.మహేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎ.ప్రవీణ్‌కుమార్, వి.రాజేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు, పరిశీలకులుగా టీఎన్జీవోల సంఘం కోకన్వీనర్ భోగ శశిధర్, ఉద్యోగ ఐకాస గౌరవాధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్‌లు వ్యవహరించారు.

వనరులు అపారం.. మంజూరులో తాత్సారం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకోగా రూ. 22 కోట్ల పెట్టుబడులతో 240 మంది ఉపాధికి కల్పన ధ్యేయంగా అధికారులు చర్యలు చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న యూనిట్లను పరిశీలించి రాయితీని మంజూరిస్తారు. టీఎస్ఐపాస్ ద్వారా అనుమతులను ఇస్తామని పేర్కొంటున్నా జిల్లాలో పెద్దగా ప్రాచుర్యం లభించటంలేదు. కొత్తగా పరిశ్రమలను పెట్టాలనుకునే వారు బ్యాంకు రుణసౌకర్యాన్ని చూసుకుని యూనిట్ నెలకొల్పిన తరువాత రాయితీని పొందే వీలుంటుంది కానీ బ్యాంకులద్వారా రుణాలందటం గగనంగా మారటంతో యువతకు సర్కారు రాయితీలు దరిచేరటం లేదు. సరుకులను రవాణాచేసే భారీ వాహనాలకు కూడా పలువురు దరఖాస్తు చేస్తున్నా మంజూరులో ఇబ్బందులున్నాయి. ప్రభుత్వపరంగా పరిశ్రమల ఏర్పాటుకుగాను జిల్లాలోని ప్రభుత్వ భూములను గుర్తించి నివేదించిన ఏ భూముల్లో ఏ పరిశ్రమను ఏర్పాటు చేస్తారనేదానిపై స్పష్టతలేదు. జిల్లాలో యవత అధికంగా ఉన్నా స్థానికంగా ఉపాధిలేక వీరిలో అత్యధికులు ఉపాధినిమిత్తం విదేశాలకు వెళ్లటం పరిపాటిగా మారింది. ఇటీవల విదేశాల్లోనూ ఉపాధికి అనువైన పరిస్థితులు లేనందున యువకులు అర్థాంతరంగా తిరిగి వస్తున్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ కార్పోరేషన్లద్వారా వ్యక్తిగత ఉపాధి యూనిట్లు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతిస్తున్నా బ్యాంకర్ల సహకారం లేనందున కనీసం 10 శాతం యూనిట్లుకూడా గ్రౌండింగ్ కావటంలేదు. జిల్లాగా ఏర్పడటం, చదువుకుని నిరుద్యోగంగా ఉన్న యువత అధికంగా ఉండటం, ఇటీవల సాంకేతిక సేవలు విస్తరిస్తుండటంతో వ్యవసాయ ఆధారిత, అంతర్జాల అనుసంధాన కంపనీలు, ఐటీ ఆధారిత కంపనీల ఏర్పాటుకుసైతం ప్రభుత్వం చొరవ తీసుకున్నట్లయితే యువతకు ఉపాధి స్థానికంగానే దక్కుతుంది.

సాగని ప్రణాళికలు..

స్తంభంపల్లిలో 75 ఎకరాల్లో మెగా ఫుడ్‌పార్కునకు ప్రతిపాదించగా పారిశ్రామిక అభివృద్ధి మండళ్ల కేటాయింపుల్లో భాగంగా జగిత్యాలకు మామిడి పరిశోధన కేంద్రాన్ని కేటాయించారు. కానీ ఇవేవీ ఆశించినట్లుగా క్షేత్రస్థాయికి చేరటంలేదు. జగిత్యాల జిల్లాలో 3,52,086 ఎకరాల సాగుభూమి ఉండగా ఇందులో ఆయకట్టులోనే 85 శాతం ఉండటం పరిశ్రమల స్థాపనకు కలిసివచ్చే అంశంగా ఉంది. జిల్లాలో అత్యధికంగా సాలీనా 2 లక్షల ఎకరాల వరిసాగు ఉండగా కేవలం 52 ముడిధాన్యం మిల్లులు, 16 ఉప్పుడు బియ్యం మిల్లులు మాత్రమే ఉన్నాయి. వరి సాగును బట్టి వీటిసంఖ్య రెట్టింపుచేసినా ఇక్కడి ఉత్పత్తికి సరిపడా మరాడించే వీలుంటుంది. సాధారణ పరిస్థితుల్లో సాలీనా 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది కాబట్టి బియ్యంమిల్లుల ఏర్పాటు ప్రధాన ఆవశ్యకతగా ఉంది. ఐకేపీలద్వారా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ సేకరించిన ధాన్యాన్ని ఈ మిల్లుల్లోనే మరాడించి రూ. 1కు కిలోబియ్యం, వసతిగృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి వినియోగించే వీలుంది. జిల్లాలో పండించే సన్నధాన్యం ద్వారా బియ్యంను మరాడించి ఎగుమతికిగాను ప్రత్యేకంగా మిల్లులను స్థాపించవచ్చు. సాలీనా 1.32 లక్షల టన్నుల మామిడి కాయలు ఉత్పత్తి అవుతుండగా ఉత్తర తెలంగాణలోనే అతిపెద్దదయిన మామిడి మార్కెట్ చల్‌గల్‌లో ఉంది. ఇక్కడ్నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలతో పాటుగా ఇతర దేశాలకు సైతం మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మామిడి కాయల ప్యాకింగ్, రవాణాతో పాటుగా మామిడి తాండ్ర, రసంతయారీ పరిశ్రమలు నెలకొల్పవచ్చు.

సానుకూలతలు..

జిల్లాలో 51 వేల టన్నుల పసుపును ఉత్పత్తి చేస్తున్నా పాలిషింగ్‌కు నిజామాబాద్, మహారాష్ట్రలోని సాంఘ్లీ, తమిళనాడు ఈరోడ్‌కు తీసుకెళతారు. జిల్లాలో పసుపు పాలిషింగ్, ఉప ఉత్పత్తులయిన పొడి, రంగులు, ఔషధాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చు. మరో ప్రధాన పంటయిన మొక్కజొన్నను సాలీనా 1.50 లక్షల ఎకరాల్లో పండిస్తుండగా జిల్లాలో పండిన మక్కలకు నాణ్యతరీత్యా మంచి గిరాకీఉండగా ఉప ఉత్పత్తులైన కోళ్లదాణా, బిస్కట్లు, గంజిపొడి పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. రైతులు దాదాపుగా లక్ష ఎకరాల్లో సంకర వరి, సూటివరి, గడ్డిజొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న, ఆవాలు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, నువ్వులు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నారు. దీనికిగాను విత్తనశుద్ధి, విత్తనోత్పత్తి కంపనీలను ఏర్పాటు చేసే వీలుంది. నువ్వులు, సోయాబీన్, వేరుసెనగ, కుసుమ, ఆవాలు, పొద్దుతిరుగుడు పంటల ఆధారితంగా నూనెమిల్లులు, కంది, పెసర, మినుము ఉత్పత్తులకు పప్పుమిల్లులను ఏర్పాటు చేసేవీలుంది. పత్తికి జిన్నింగ్‌మిల్లు, మిరప ఉపఉత్పత్తుల తయారీకి మిల్లులను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అరటి, బొప్పాయి, ఇతర పండ్లతోటలు, ఉల్లి, కూరగాయల సాగు అధికంగా ఉండగా ఇటీవల పలువురు రైతులు హరిత గృహాల్లోనూ కూరగాయలను, పూలను పండిస్తున్నారు. అన్ని పంటల్లోనూ ఆహారశుద్ధి, ఎగుమతి పరిశ్రమలను నెలకొల్పే వీలుంటుంది. దీనికిగాను యువతకు ఉపాధి లభించేలా చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలను రాయితీతో మంజూరిచ్చినట్లయితే దీర్ఘకాలికంగా ఉపాధిమార్గంగా మారుతుంది.

దూరం.. 'మీనా ప్రపంచం'

(మొదటిపేజీ తరువాయి)

టెలివిజన్ ద్వారా మనటీవీ కార్యక్రమాల ద్వారా బోధన అందించారు. గతేడాది డిజిటల్ తరగతులు ప్రారంభించడంతో టీవీలను పక్కకు పడేశారు. ప్రస్తుతం టీవీలతోపాటు డిజిటల్ తరగతులు కూడా పలు పాఠశాలల్లో ప్రారంభించడం లేదు. ప్రభుత్వం రూ.లక్షల్లో పెట్టుబడిపెట్టి అందిస్తే వాటి నిర్వహణ లేకపోవడంతో మూలన పడుతున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సాంకేతిక బోధన అందించాలని కంప్యూటర్లను అందించగా వాటికి శిక్షకుడిని నియమించలేక వాటిని మూలన పడేశారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి ఆ తర్వాత వాటి నిర్వహణపై పర్యవేక్షణ కొరవడంతో విద్యార్థులకు ఆధునిక బోధన అందకుండా పోతుందన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించి అమలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లయితే విద్యార్థులకు మేలు కలగనుంది.

రేడియో పాఠాలతో సులభంగా అర్థమవుతుంది



- వైష్ణవి, ఎనిమిదోతరగతి, అర్పపల్లి

విద్యాశాఖ నిర్వహించే మీనా ప్రపంచం రేడియో పాఠాలు సులభంగా అర్థమయ్యేది. రేడియోలో ప్రసారం చేసే కథలు, నాటికలు, పాఠ్యాంశాలు అందిస్తుండేవారు. ప్రస్తుతం పాఠాలు ప్రారంభం కాకపోవడంతో బోధన అందడంలేదు. రేడియో పాఠాలను అందించేలా చూడాలి.

అమలుకు చర్యలు తీసుకుంటాం

- వెంకటేశ్వర్లు, జిలా విద్యాధికారి

మీనా ప్రపంచం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం విద్యార్థుల ఆన్‌లైన్, ఆధార్ సీడింగ్ కొనసాగిస్తున్నాం. వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో కార్యక్రమం అమలు చేసి విద్యార్థులకు రేడియో పాఠాలు అందేలా చూస్తాం.

స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుని నియామకం

జగిత్యాల ధరూరుక్యాంపు: నవతెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా హస్నాబాద్ గ్రామానికి చెందిన సోమడి రాజురావును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సంజయ్ కుమార్ ప్రకటించారు. విద్యార్థులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ ద్వారా కృషిచేయాలని సూచించారు.

గుట్కా విక్రేత అరెస్టు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల బ్రహ్మణవాడలో గుట్కా విక్రయిస్తున్న గందె లక్ష్మన్ అనే వ్యాపారిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఆర్.ప్రకాశ్ తెలిపారు. అతని నుంచి రూ.19,750 విలువైన గుట్కాలు స్వాధీన పర్చుకొని రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

ఎడ్ల బండిపై నుంచి పడి గిరిజన రైతు మృతి

సారంగాపూర్, న్యూస్‌టుడే: సారంగాపూర్ మండలం రేచపల్లిలోని బీంరెడ్డి గిరిజన తండాకు చెందిన ఓ గిరిజన రైతు ఎడ్ల బండిపై నుంచి పడి మృతి చెందాడు. తండాకు చెందిన కర్నాటకపు కిష్టయ్య(50) తన పంట పొలానికి ఎరువులు అవసరం కావడంతో ఎడ్ల బండిపై రేచపల్లికి వచ్చాడు. ఎరువులను తీసుకుని వెళ్తుండగా చెరువు కట్టపై అదపు తప్పి ఎడ్ల బండి కింద పడటంతో మృతి చెందాడు. గిరిజన రైతు కిష్టయ్యకు భార్య రాజవ్వ, కూతురు బుజ్జవ్వ ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రణధీర్‌కుమార్ పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.



మృతి చెందిన గిరిజన రైతు కిష్టయ్య


న్యాయవాదుల విధుల బహిష్కరణ

జగిత్యాల: జగిత్యాల కోర్టులో బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. సోమవారం రాత్రి మెజిస్ట్రేట్ మధు ఇంటి ముందు పరీక్షిత్‌రెడ్డి అనే యువకుడు గొడవకు దిగడంతో పోలీసులు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. యువకుడి చర్యను నిరసిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు మరో రెండ్రోజులు విధులకు దూరంగా ఉండాలని నిర్ణయించారు.

హరితవేగం పెంచాలి: కలెక్టర్ డాక్టర్ శరత్

జగిత్యాల: జిల్లాలో హరితహారం వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ ఆదేశించారు. జగిత్యాల ఆర్డీవో కార్యాలయం నుంచి బుధవారం జిల్లాలోని అన్నిశాఖల అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకం నిరంతరం కొనసాగాలని రెండ్రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందుకు భారీగా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడ వర్షం పడితే అక్కడ మొక్కలు నాటాలన్నారు. పురపాలక సంఘాల్లో నాటిన మొక్కలకు రక్షణ చర్యలు తీసుకోవాలని ధాన్యం మిల్లుల తరపున 400 ట్రీ గార్డులు సమకుర్చాలన్నారు. పట్టణాల్లో స్మృతివనాలు ఏర్పాట్లు చేయాలని, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికల పనులు వేగవంతం చేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు చొరవచూపి లక్ష్యం సాధించే విధంగా చూడాలన్నారు. మండలాల వారీగా గుర్తించిన సమస్యలను వాట్సాప్ ద్వారా వెంటనే తన దృష్టికి తేవాలని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ప్రతి బుధవారం కచ్చితంగా హరితహారం కార్యక్రమం చేపట్టాలన్నారు. మండలాల అధికారులు ప్రత్యేక అధికారితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రతి అంశంపై పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ శరత్ ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారుఖీ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు



జగిత్యాల

- బాలాజీ- ఫిదా
- నటరాజ్ - జయ జానకి నాయకా
- దుర్గరాజ - నక్షత్రం
- శ్రీనివాస - లై
- శ్రీరామా- నేనే రాజు నేనే మంత్రి

మెట్‌పల్లి

- లక్ష్మి- జయ జానకి నాయకా
- సాయికృష్ణ- నేనే రాజు నేనే మంత్రి

కోరుట్ల

- లక్ష్మి- లై
- కిన్నెర- నేనే రాజు నేనే మంత్రి

మాటల గారడీ.. సొమ్ముకు బురిడీ!



న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు:

ఏటీఎం కార్డుల ద్వారా డబ్బులు స్వాహా చేస్తున్నారంటూ కరీంనగర్ కమిషనరేట్‌లోని పోలీస్‌స్టేషన్‌లకు వస్తున్న ఫిర్యాదులు పెరిగాయి. మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లు, దొంగలు రోజుకో కొత్త శైలిలో బాధితులకు మస్కా కొడుతున్నారు. ఏటీఎం కేంద్రాలు, డెబిట్‌కార్డులే లక్ష్యంగా వీరు రెచ్చిపోతున్నారు. నగరంలోని వరుసగా సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు వారిని పట్టుకునేందుకు విచారణ ముమ్మరం చేయగా ముంబయి, దిల్లీ, నోయిడా, ఝార్ఖండ్‌లలో ఉండి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. మోసపోయి ఫిర్యాదు చేసేందుకు వస్తున్న వారిని ఓదార్చుతూనే ఇకపై స్వీయజాగ్రత్తలు పాటించండంటూ చెబుతున్నారు.



ఈ నెల 9న కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన సింగిరి ఊశయ్యకు ఫోన్‌చేసి ఎస్‌బీహెచ్ బ్యాంకు మేనేజర్‌నని చెప్పాడు. ఏటీఎం కార్డు, ఆధార్‌కార్డుకు అనుసంధానం చేయాలని, లేకుంటే.. ఏటీఎం పనిచేయదని నమ్మించాడు. నమ్మిన ఊశయ్య ఆధార్ కార్డు నంబర్, ఏటీఎం పిన్ నంబర్ చెప్పాడు. ఊశయ్య ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. బ్యాంకుకు వెళ్లి చూడగా రూ. 49,948 డ్రా అయ్యాయి.. రెండో ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారం క్రితం.. కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన విశ్వనాథంకు ఫోన్ వచ్చింది. తాను ఎస్‌బీహెచ్ ప్రధాన కార్యాలయ మేనేజర్‌ను మాట్లాడుతున్నానని చెప్పి ఏటీఎం పిన్‌నంబర్లు తనిఖీ చేస్తున్నామని చెప్పాడు. విశ్వనాథం నిజమా కాదా..? అని తెలుసుకునేందుకు వచ్చిన నంబర్‌ను ట్రూకాలర్‌లో చూసుకుంటే ఎస్‌బీహెచ్ మేనేజర్ అని వచ్చింది. నమ్మిన విశ్వనాథం ఏటీఎం పిన్ నంబర్ చెప్పాడు. తదుపరి విశ్వనాథం సెల్‌ఫోన్‌కు డబ్బులు విత్‌డ్రా అయినట్లు మెసేజ్‌లు వస్తుండగా అనుమానం వచ్చి బ్యాంకుకు వెళ్లి సంప్రదించగా రూ. 50 వేలు ఖాతా నుంచి విత్‌డ్రా అయ్యాయి. ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమిషాల వ్యవధిలో..

బ్యాంకు అధికారులు, కార్డుదారులకు మాత్రమే తెలిసిన డెబిట్ కార్డు నంబర్లను దొంగలు సేకరిస్తున్నారు. తద్వారా వినియోగదారుడి చరవాణి నంబరు తెలుసుకొని ఖాతాల్లో ఉన్న డబ్బును నిమిషాల వ్యవధిలో మొబైల్ యాప్ ద్వారా బదిలీ చేసుకుంటున్నారు. ముంబయి, ఝార్ఖండ్ నుంచి నేరగాళ్లు ఈ మోసాలు చేస్తున్నారని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. దిల్లీ, నోయిడాల్లోనూ ఇలాంటివి పెరుగుతున్నాయని, రహస్య సమాచారం బయటకు వెళ్లకుండా చూసుకోవాలని బ్యాంకు అధికారులకు పోలీసులు సూచిస్తున్నారు. జాతీయ, బహుళజాతి, ప్రైవేటు బ్యాంకులు డెబిట్, క్రెడిట్ కార్డుల జారీని పొరుగుసేవలకు అప్పగించాయి. వినియోగదారుల వివరాలను ఆయా సంస్థకు ఇచ్చి వారి ద్వారా కార్డులను పంపుతున్నాయి. అయితే పొరుగు సేవల విభాగంలోని కింది స్థాయి సిబ్బందిని ప్రలోభపెట్టి వేర్వేరు రాష్ట్రాలకు చెందిన బ్యాంకు ఖాతాదారుల కార్డుల వివరాలను తీసుకునే మోసగాళ్లూ ఉన్నారు.

ఆన్‌లైన్‌లో షాపింగ్..

దొంగలు, మోసగాళ్లు అమాయకులకు ఫోన్ చేసి కార్డు నంబరు, వివరాలు, సీవీవీ నంబరు తీసుకుంటున్నారు. నంబర్లు వచ్చిన వెంటనే అంతర్జాలం ద్వారా ఆ వివరాలను నమోదు చేసి ఖరీదైన వస్తువులను సొంత చిరునామాకు తీసుకుంటున్నారు. గతంలో కొందరు నైజీరియన్ సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేయగా మోసాలు బయటపడ్డాయి.. కొన్ని రోజుల క్రితం వరకు కరీంనగర్ సైబర్ నేరాలు తగ్గగా.. ఇటీవల ఈ నేరాలు ఎక్కువగా పెరిగాయి.

ఖాతాదారులకు 2 శాతం... మధ్యవర్తులకు 10శాతం

సాధారణంగా మోసాలపై ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు ప్రారంభిస్తారు. బాధితుల డబ్బులను ఏయే ఖాతాలకు బదిలీ చేశారు..? ఏయే సెల్ నంబర్ల ద్వారా మోసగాళ్లు మాట్లాడారనే విషయాన్ని తేల్చేలా విచారణ సాగుతుంది. అయితే అప్పటికే సెల్ నంబరు దాదాపు స్విచ్ ఆఫ్ అయి ఉంటుంది. ఈ క్రమంలో బ్యాంకు ఖాతా నంబర్లను ఆరా తీస్తే సాధారణంగా ముంబయి, దిల్లీ లేదంటే ఈశాన్య రాష్ట్రాల ఖాతాదారుల చిరునామాతో ఉంటాయి. ఇక్కడ నేరగాళ్లు తెలివిగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్, కరీంనగర్ వెళ్లేటప్పుడు ఇలా సుదూర ప్రాంతాల నుంచే ఆపరేట్ చేస్తున్నారని పలు కేసుల దర్యాప్తులో తేటతెల్లమైంది. అంత దూరం వెళ్లడమెందుకని పోలీసులు శ్రద్ధ పెట్టకపోతే ఇబ్బందే ఉండదని మోసగాళ్ల భావనగా తేలింది. జిల్లా పోలీసులు అక్కడికీ వెళ్లి బ్యాంకు ఖాతాదారుల్ని గుర్తించి అరెస్టు చేసినా ఖాతాదారులంతా చిన్నచేపలే అవుతుండటంతో రికవరీ గగనమవుతోంది. అసలు నేరగాళ్లు అమాయకులకు చిన్న మొత్తంలో డబ్బు ఎర వేసి ఖాతాలను తెరిపిస్తున్నారు. ఏటీఎం తమ వద్ద ఉంచుకుని డబ్బులు బదిలీ అయిన వెంటనే డ్రా చేసుకుంటున్నారు.



బ్యాంకర్లు రహస్య సమాచారం అడగరు

- వి.బి కమలాసన్‌రెడ్డి, పోలీస్ కమిషనర్

బ్యాంకు అధికారులు రహస్య సమాచారాన్ని ఎప్పుడూ అడగడరు. మాటలతో గారడీచేసే ముఠాలు ఎన్నో ఉన్నాయి.. ప్రజలు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉన్నప్పుడు ఇలాంటి నేరాలను తగ్గించే అవకాశం ఉంటుంది. బ్యాంకు అధికారులమని ఫోన్‌లు వచ్చినప్పుడు సమాచారం చెప్పకుండా నేరుగా బ్యాంకులకు వెళ్లి సంప్రదించాలి. పోలీసులు మోసగాళ్లను పట్టుకోవడం కష్టం.. పట్టుకున్నా నగదు రికవరీ సాధ్యం కాదు.

ఎవరూ అడగరు..

ప్రతి ఒక్కరు కొన్ని స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ తుల శ్రీనివాస్‌రావు తెలిపారు. డెబిట్ కార్డుల మోసాలను ఎప్పటికప్పుడు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వాట్సప్, ఫేస్‌బుక్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఏటీఎం కార్డు నంబరును ఫోన్‌లో బ్యాంకు అధికారులు ఎప్పుడూ అడగరు.. మీ వివరాలు అప్‌డేట్ చేస్తామని ఎవరైనా చెప్పినా నమ్మకూడదు. కార్డులో మొదటి 8 నంబర్లను మోసగాళ్లు చాలా తేలికగా చెప్పేస్తారు. అరె బ్యాంకు అధికారులు చేశారే అని అనుకోకూడదు. వారి వద్ద ఆ 8 నంబర్లు మాత్రమే ఉంటాయి.

సైబర్ నేరగాళ్ల వద్ద డెబిట్ కార్డు వెనుక వైపు ఉండే సీవీవీ సంఖ్య ఉండదు. దీని కోసం వారు చాలా సేపు మనల్ని మాటల్లో పెడతారు. సీవీవీ నంబరు మనం చెప్పగానే చరవాణికి వచ్చే సంక్షిప్త సందేశంలో అంకెను చెప్పమంటారు. ఇలాంటివేవీ వారికి చెప్పకూడదు. పైగా బ్యాంకు అధికారులు కూడా ఖాతాదారులను ఇవి అడగరు.

పాతకార్డుల స్థానంలో కొత్తవి పంపుతామని, రెండు రోజుల్లో బ్యాంకుల నుంచి తీసుకోవచ్చంటూ ఇంకొందరు ఫోన్ చేస్తుంటారు. డెబిట్ కార్డు వివరాలు మిమ్మల్ని అడగ్గానే తక్షణం ఫోన్ పెట్టేయండి.

నగదు కోసం ఏటీఎంలకు వెళ్లినప్పుడు పక్కన ఎవరైనా ఉంటే... కొంచెం దూరంగా వెళ్లండని చెప్పండి. మిమ్మల్ని గమనిస్తున్నారన్న అనుమానం రాగానే నగదు విత్‌డ్రా చేయకండి.

నగదు తీసుకునేప్పుడు ఏటీఎం యంత్రం వద్ద అంకెలపై నొక్కే క్రమంలో ఏదైనా తేడాగా కనిపిస్తే (అంకె నొక్కినప్పుడు కీ బోర్డు జారినట్లు అనిపిస్తే) వెంటనే వేరే కేంద్రానికి వెళ్లండి. నేరస్తులు కనీకనిపించని పేపరు ఉంచే అవకాశాలున్నాయి.



రాయపట్నం వద్ద ఎరతో చేపలకు గేలం వేసిన మత్స్యకారులు



గోదావరిలో వల వేస్తున్న మత్స్యకారుడు

నదికి జలకళ.. ఉపాదికి వల

జిల్లా సరిహద్దున ఉన్న రాయపట్నం పురాతన వారధి వద్ద గోదావరిలోకి కొత్త నీరు రావడంతో మత్స్యకార్మికులు జోరుగా చేప పిల్లలను పడుతున్నారు. ఇన్నాళ్లూ నీరు తగ్గిపోయిన ఈ ప్రాంతంలోకి వరద నీరు వచ్చి చేరుతున్నందున మత్స్యకార్మికుల సంతోషానికి అవధుల్లేవు. నదికి జలకళ రావడంతో కార్మికుల బతుకు జీవకళ వచ్చినట్లయింది. రాయపట్నం వద్ద ఇప్పుడిప్పుడే చేపల వేటను ప్రారంభిస్తున్నారు. వరద నీరు నిలిస్తే మత్స్యకార్మికులకు మరింత ఉపాధి కలిగే అవకాశముందని భావిస్తున్నారు.

–న్యూస్‌టుడే, ధర్మపురి

నైపుణ్యంతో ఉద్యోగంలో రాణింపు

శాతవాహన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులు సాఫ్ట్ స్కిల్స్, నైపుణ్యంతో విధి నిర్వహణలో రాణిస్తారని జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం వాగేశ్వరీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ లెర్నింగ్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంహెచ్‌ఆర్డీ విభాగం శిక్షణ అందిస్తోందని ప్రతి ఒక ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఆరు రాష్ట్రాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారని.. అందులో తెలంగాణ ఒకటిగా ఉండటం గర్వకారణం అన్నారు. ప్రతి జిల్లా నుంచి సుమారు 400 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఈ శిక్షణ లభిస్తుందని చెప్పారు. 60 రోజుల్లో ఈ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెలాఖరు వరకు 9 వేల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

హరిత లక్ష్యం హరీ!



హరితహారంలో నాటిన మొక్కల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి సంరక్షణ చర్యలు చేపడుతుండగా నాటాల్సిన మొక్కలు మాత్రం నిరాదరణకు గురవుతూ ఇలా పిచ్చిమొక్కల మధ్య ఉనికిని కోల్పోతున్నాయి. వెల్గటూరు మండలం చెగ్యాం-శానబండ గ్రామాల మధ్య రైతులు పొలాల గట్ల వెంట నాటుకునేందుకు టేకు మొక్కలు పంపిణీ చేశారు. వాటిని నాటించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

–న్యూస్‌టుడే, వెల్గటూరు

జగిత్యాల

నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: సత్యసాయి అభయాహస్తం సేవా సంస్థ సభ్యుల ఆర్థిక సహకారంతో ఓ నిరుపేద యువతికి వివాహం జరిపించారు. పట్టణానికి చెందిన కూసరి మీన అనే నిరుపేద యువతికి ఓగులాపూర్‌కు చెందిన జైశెట్టి గణేష్‌తో బుధవారం సభ్యులు వివాహం చేశారు. వివాహానికి అవసరమైన ఖర్చులు సేవాసంస్థ ద్వారా అందజేశారు. సభ్యుల ఆర్థిక సహకారానికి వధువు తల్లిదండ్రులు వనజ వెంకటి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు బెంచీల వితరణ

రాయికల్, న్యూస్‌టుడే: మండలంలోని అయోధ్య ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కొత్తూరి జలపతి రూ.15 వేల విలువ గల 10 బెంచీలను పాఠశాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జలపతిని గ్రామ సర్పంచి ఎడ్మల శారద, ఎంపీటీసీ సభ్యురాలు సిరిపురం లక్ష్మి, విద్యాకమిటీ అధ్యక్షుడు జోగిని శేఖర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొన్నం రమేష్ తదితరులున్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో నరేందర్ తదితరులు

లోకమాత ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో లోకమాత పోచమ్మతల్లి దేవస్థానంలో జరిగే 55వ వార్షికోత్సవ వేడుకల గోడపత్రికను ఆర్డీవో నరేందర్, బల్దియా అధ్యక్షురాలు టి.విజయలక్ష్మితో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 18 నుంచి 21 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో బల్దియా అధ్యక్షురాలు టి.విజయలక్ష్మి, కమిషనర్ సంపత్‌కుమార్, రాజగోపాలాచారి, చంద్రప్రకాశ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

కల్లెడ(జగిత్యాల గ్రామీణం): జగిత్యాల మండలం కల్లెడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సరస్వతివిగ్రహాన్ని నెలకొల్పుటకు పాఠశాలలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, సర్పంచి జోగినపల్లి మంజుల, ఎంపీటీసీ సభ్యురాలు అంకతి సువర్ణతోపాటు సత్యనారాయణరావు, రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ ట్రాకర్లకు దరఖాస్తుల వెల్లువ

రాయికల్: రాయికల్ మండలానికి ఈ ఏడాది యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు జనరల్(6), ఎస్సీ(1),ఎస్టీ(1) మొత్తం ఎనిమిది రాయితీ ట్రాక్టరు యూనిట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు సుమారు 40 దరఖాస్తులు వచ్చాయని మండల వ్యవసాయాధికారి అనిల్ తెలిపారు. ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు తమ దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అర్హులైన గిరిజనులందరికి భూములు పంపిణీ

బీర్‌పూర్: అర్హులైన గిరిజనులందరికీ భూములు పంపిణీ చేస్తామని, వివాదాలకు వెళ్లొద్దని ఆర్డీవో నరేందర్ పేర్కొన్నారు. బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయిలోని వివాదాస్పద భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడుతూ.. చిన్న కొల్వాయిలోని 306 సర్వేనంబరులో దాదాపు 170 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందని ఆయా భూములను గిరిజనులకు అందించేలా చూస్తామన్నారు. ప్రస్తుతం చిన్న కొల్వాయిలో 32 గిరిజన కుటుంబాలు ఉండగా 60 మంది వరకు భూములు లేనివారి ఉండగా వారికి భూములు లేకుండా ఉండి అర్హులుగా ఉంటే భూములను అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తండా శివారులోని నాగోబ ఆలయానికి రూ.లక్ష వరకు నిధులు మంజూరు చేసేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. కార్యక్రమంలో బీర్‌పూర్, ధర్మపురి తహసీల్దార్లు రాజేందర్, నవీన్, నాయబ్ తహసీల్దారు వెంకటరమణ, రెవెన్యూ పరిశీలకుడు ముక్తార్‌అలీ, వీఆర్వో సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మీసేవ కేంద్రాలను నిర్వహించాలి

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు తమ కేంద్రాలను నిర్వహించుకోవాలని టి.యస్ టి.యస్ మీసేవ కేంద్రాల జిల్లా మేనేజర్ రాజు అన్నారు. బుధవారం రాయికల్ మండల కేంద్రంలో టి.ఎస్.టి.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు మీసేవ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీసేవ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు త్వరితగతిన సేవలు అందివ్వాలన్నారు. ఆయన వెంట పి.ఎమ్,జి దిశ కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ తుమ్మ సతీష్ ఉన్నారు.

అన్నీ ఖాళీలే.. ప్రజలకు సేవలందేదెలా?

పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు లేక అవస్థలు

సారంగాపూర్, న్యూస్‌టుడే

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 22 పంచాయతీలు ఉండగా మరో 10 వరకు శివారు తండాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు ఏడు పంచాయతీ కార్యదర్శులు మాత్రమే ఉండగా రెవెన్యూ కార్యదర్శులదీ అదే పరిస్థితి. ఆయా మండలాల్లో కేవలం 10 మంది మాత్రమే ఉండగా రెవెన్యూ కార్యదర్శులు కూడా అదే తీరుగా ఉండటంతో ఆయా మండలాల ప్రజలు అవస్థలు పడతున్నారు. అరకొర సిబ్బందితోపాటు ప్రభుత్వం నిత్యం ఏదో సర్వే పేరుతో ఉరుకులు పరుగులు తీయించడంతో ఎటూ న్యాయం చేయలేక సమతమతవుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో కార్యదర్శుల సేవలు అందడం లేదు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శుల ఖాళీలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

22 గ్రామాలు.. ఏడుగురు కార్యదర్శులు

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలు పూర్తిగా అటవీ ప్రాంతంగా ఉండటమే కాకుండా ఆయా మండలాల్లో 22 గ్రామ పంచాయతీలు ఉండగా మరో పది వరకు శివారు గిరిజన తండాలు ఉన్నాయి. వీటన్నింటికి కేవలం ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు మాత్రమే పనిచేస్తున్నారు. ఒక్కో కార్యదర్శికి రెండు, మూడు గ్రామాల అదనపు బాధ్యతలను అప్పగించారు. వీటికి తోడు ప్రభుత్వం నిర్వహించే హరితహారం, మరుగుదొడ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకాలను పరిశీలించాల్సి వస్తుంది. ఒక్కో కార్యదర్శికి మూడు గ్రామాలు ఉండగా ఏ గ్రామంలో ఉంటున్నాడో తెలియని పరిస్థితి. సారంగాపూర్ మండలంలోని కండ్లపల్లి, చర్లపల్లి, సారంగాపూర్, నర్సింహులపల్లె గ్రామాలకు శ్యామల కార్యదర్శిగా కొనసాగుతుండగా శ్రీనివాస్‌కు తాళ్లధర్మారం, రేకులపల్లె, కొల్వాయి, రంగపేట గ్రామాలు, శ్రీకాంత్‌కు పోతారం, కోనాపూర్, అర్పపల్లి, వెంకట్‌రెడ్డికి తుంగూర్, రేచపల్లి, శంకరయ్యకు లక్ష్మీదేవిపల్లె, బట్టపల్లి, వీఎల్ఎన్‌చారీకి మంగెళ, రంగసాగర్, కమ్మునూర్, లక్ష్మన్‌కు పెంబట్ల, బీర్‌పూర్ గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. ఒక్కొక్కరికి మూడేసి గ్రామాలు ఉండగా అవి పక్క పక్కకే కాకుండా సారంగాపూర్ మండలంలో ఒక గ్రామం ఉంటే బీర్‌పూర్ మండలంలో మరో గ్రామం ఉన్నాయి. ఇలా ఆ మండలానికి వెళితే ఇక్కడి మండల ప్రజలకు అందుబాటులో ఉండలేకపోతున్నారు.

రెవెన్యూ సిబ్బందిదీ అదే పరిస్థితి

మండలంలోని 22 గ్రామాలకు కేవలం పది మంది రెవెన్యూ కార్యదర్శులు మాత్రమే కొనసాగుతున్నారు. సారంగాపూర్ మండలంలోని 11 గ్రామాలకు కేవలం నలుగురు వీఆర్వోలు మాత్రమే ఉన్నారు. బీర్‌పూర్‌లో 12 క్లస్టర్లకు గాను ఆరుగురు ఉన్నారు. బీర్‌పూర్ మండలంలో కొంత పర్వాలేదనకున్నా.. సారంగాపూర్ మండలంలో మాత్రం రెవెన్యూ కార్యదర్శుల ఖాళీలతో అవస్థలు పడాల్సి వస్తుంది. గత కొన్నేళ్లుగా మండలంలో జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, సర్వేయర్ పోస్టులకు ఖాళీగా ఉంటున్నాయి. వాటిని పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు సర్వేయర్ లేకపోవడంతో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి.



గ్రామంలో రహదారి దుస్థితి

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించలేకపోతున్నాం

- శ్యామల, పంచాయతీ కార్యదర్శి



ఒక్కో పంచాయతీ కార్యదర్శికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలను అప్పగించడంతో గ్రామాభివృద్ధిపై దృష్టి సారించలేకపోతున్నాం. కనీసం గ్రామంలోని మురుగు కాలువల నిర్వహణ, క్లోరినేషన్, వీధి దీపాల ఏర్పాటు చూసుకోలేకపోవడంతో ప్రజలతో ఇబ్బంది పడుతున్నాం.

రైతులకు న్యాయం చేయలేకపోతున్నాం

- సత్యనారాయణ, రెవెన్యూ కార్యదర్శి



భూ సమస్యలపై రైతుల వస్తే ఎక్కడ ఉంటున్నామో తెలియక పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నాం. ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే సరైన సమయానికి అందించే వీలు లేకుండా పోతుంది. పూర్తి స్థాయిలో సిబ్బంది నియమించాలి.

కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది

- కర్నె నర్సింహారెడ్డి, రైతు, రేచపల్లి



కార్యదర్శితో పని కావాల్సి ఉంటే మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఒక్కొక్కరికి రెండు మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. చిన్న పని ఉన్నప్పటికీ రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది.

ఒకే టీకా.. చిన్నారులకు రక్ష

సారంగాపూర్ మండలంలో పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

సారంగాపూర్, న్యూస్‌టుడే: 9 నెలల నుంచి చిన్నారుల నుంచి 15ఏళ్లలోపు గల చిన్నారులకు మీజిల్స్(తట్టు), రుబెల్లా(పొంగు) వ్యాధుల నుంచి రక్షణ కోసం ఈనెల 17 నుంచి 23 వరకు టీకాలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలంలోని 11638 మంది 9 నుంచి 15ఏళ్లలోపు చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 73 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉండగా ఆయా పాఠశాలల్లో టీకా వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో సారంగాపూర్, బీర్‌పూర్ మండలంలో పది ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాల పరిధిలోని సారంగాపూర్‌లో 1261 మంది చిన్నారులు, రేచపల్లిలో 1461, లక్ష్మీదేవిపల్లెలో 1477, పెంబట్లలో 1413, నాగునూర్‌లో 996, బీర్‌పూర్‌లో 1564, తుఎంగూర్‌లో 678, కొల్వాయిలో 688, తాళ్లధర్మారంలో 918, మంగెళలో 1182 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించి టీకాలు వేసేందుక ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాలలతోపాటు 66 కేంద్రాలను ఏర్పాటు చేసి టీకాలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



తట్టు, రుబెల్లా టీకా మందులను సిద్ధం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఏర్పాట్లు పూర్తి చేశాం

- అసిముల్లా నజ్మీ, సీహెచ్‌వో

తట్టు, రుబెల్లా టీకాను వేసేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు టీకాలు వేసిన అనంతరం, ఎక్కడైనా పిల్లలు తప్పిపోతే వారికి ఇంటింటా వెళ్లి టీకా వేయనున్నాం. టీకా వేసిన పిల్లలను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రెండు వ్యాధులకు ఒకే టీకా పనిచేస్తున్నందున ప్రతి చిన్నారికి తల్లిదండ్రులు తప్పకుండా టీకా వేయించాలి.

చలో దిల్లీ పోస్టరు ఆవిష్కరణ

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఈనెల 23న దిల్లీ నిర్వహించే చలో దళిత మహాధర్నా గోడ ప్రతులు, కరపత్రాలను బుధవారం సారంగాపూర్‌లో ఆవిష్కరించారు. మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మేడి అంజయ్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు ఎండబెట్ల ప్రసాద్, బండ శంకర్, ఎండబెట్ల వరుణ్‌కుమార్, కొండ ప్రభాకర్, సత్యం, తోట గంగాధర్, అనిల్, ఎండబెట్ల దీప్తి, మధు, గంగాధర్, మహేష్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేయాలి

రాయికల్ పట్టణం: హరితహారం కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మొక్కలు నాటేలా చర్యలు తీసుకుని మొక్కల సంరక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని మండల మానవ వనరుల కేంద్రంలో త్రీఆర్స్, ఎల్ఈపీ కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. త్రీఆర్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యసన ప్రక్రియలు మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్యాంసుందరాచారి తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించినప్పుడే హరితహారం విజయవంతం అవుతుందని డీఎఫ్‌వో రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం సారంగాపూర్ మండలంలోని పోతారంలో నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. బీర్‌పూర్ మండలంలోని కమ్మునూర్‌లోనూ గ్రామ సందర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వసంత, రాజేందర్, మండల పర్యవేక్షకుడు వేణుమాధవ్, మధుసూదన్‌రావు, సెక్షన్ అధికారి కనుకయ్య, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం ఓదెల గంగాధర్, సాంకేతిక సలహాదారు సాయికుమార్ పాల్గొన్నారు.



పోతారంలో మొక్కలను నాటుతున్న డీఎఫ్‌వో రమేష్

జగిత్యాల

బీడీ కార్మికుల సదస్సు 18న

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణం నిజామాబాద్ రహదారిలోని రాయల్ ఫంక్షన్ హాలులో బీడీ కార్మిక సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ఈ నెల 18న సదస్సు ఉంటుందని బీఎంఎస్, ఏఐటీయూసీ, ఐపీటీయూ నాయకులు సుధీర్‌కుమార్, ఎం.డి.ముఖ్రం, చింత భూమేశ్వర్, కట్ట విజయ్ తెలిపారు. జీఎస్టీ కారణంగా బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై తీర్మానించారు.

నిఘా నేత్రం

మండల కేంద్రంలో 30 సీసీ కెమెరాల ఏర్పాటుకు సర్వం సన్నద్ధం



మండల కేంద్రంలో రద్దీగా ఉండే పాతబస్టాండ్ ప్రాంతం

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో నేరాలు పెరిగేకొద్దీ వాటిని అరికట్టడానికి పోలీసులపై ఒత్తిడి పెరుగుతుంది. సివిల్ కేసులు, భూ తగాదాలు, పరస్పర దాడులు, హత్యలు, హత్యాయత్నాలు, చోరీలు, వేధింపులు.. ఇలా వందల ఘటనలతో నిత్యం పోలీసులు తలమునకలవుతుంటారు. ఈ నేపథ్యంలో సిబ్బంది కొరత ఉన్నవారిపై పని భారాన్ని మోపుతుంది. ఠాణాల్లో సగానికి సగం సిబ్బంది కొరత ఉండటం, నూతన జిల్లాల ఏర్పాటుతో మండలానికి వచ్చే వీఐపీల సంఖ్య పెరగడంతో శాంతి భద్రతల అమలు పూర్తి స్థాయిలో ఉండటం లేదు. మండలంలో యువకుల ఆగడాలు, వరుస దొంగతనాలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. తాళాలు పగులగొట్టి బీరువాలోని ఆభరణాలను, సొత్తును దొంగలించడం, ఆలయాల్లోని హుండీలు చోరీకి గురవడం వంటి సంఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. పరిమితికి మించి వేగంతో వాహనాలను నడపడం, త్రిబుల్ రైడింగ్, విచ్చలవిడితనం పెరిగి పోతోంది. మండల కేంద్రంలోని స్థానిక బస్టాండు ఇరుకుగా ఉండగా బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రైవేటు వాహనాదారులు ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్డుపై నిలుపడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేలా పోలీసులు మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు.

దుకాణదారులతో సమావేశం

మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సుమారు రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించడంతో ఎస్సై శివకృష్ణ స్థానిక దుకాణదారులతో సమావేశం నిర్వహించి పట్టణంలో సీసీకెమెరాల ఆవశ్యకతను వారికి వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమయ్యే పరికరాలను స్వచ్ఛందంగా కొనివ్వాలని కోరారు. దీంతో స్థానిక వ్యాపార, వాణిజ్య సంఘాల నాయకులు తమ సంఘాల్లో చర్చించి నిధులను సేకరించి అవసరమైన పరికరాలను దశలవారీగా ఠాణాలో అందజేస్తున్నారు. స్థానిక సిటీ కేబుల్ నిర్వాహకులు టీవీ ప్రసారాలకు వినియోగించే తమ కేబుల్‌ను సీసీ కెమెరాల అనుసంధానికి ఉపయోగించుకునేందుకు ఒప్పుకున్నారు. దీంతో కొంత మేర కేబుల్ ఖర్చు తగ్గనుంది.

ప్రధాన కూడళ్ల ఎంపిక

పట్టణంలోని ప్రధాన కూడళ్లయిన శివాజీ చౌరస్తా-3, అంగడిబజార్-3, ఇటిక్యాల క్రాస్‌రోడ్డు-3, గాంధీ చౌరస్తా-3, భరతమాత చౌరస్తా-3, సర్దార్ పటేల్ విగ్రహం-3, తెలంగాణ తల్లి విగ్రహం-3, వారసంత-2, పోలీస్ ఠాణా-4 కెమెరాల వంతున అమర్చనున్నారు. వీటితో పాటు ప్రధాన దేవాలయాలు, మజీద్, చర్చిల వద్ద అవకాశాన్ని బట్టి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

ఠాణా నుంచే వీక్షించే ఏర్పాటు: ఎస్సై శివకృష్ణ



ప్రస్తుతం సీసీ కెమెరాలు మూడో కన్నుగా గుర్తింపు పొందాయి. రక్షణ సిబ్బంది మాదిరిగా ప్రతి కదలికలను రికార్డు చేసి చిత్రాలు, దృశ్యాల రూపంలో భద్రపరుస్తుంది. మండల కేంద్రంలో అమర్చే 30 సీసీ కెమెరాలతో ప్రతి చౌరస్తాలో జరిగే సంఘటనలను నేరుగా ఠాణా నుంచే వీక్షించవచ్చు. త్రిబుల్ రైడింగ్, పరిమితికి మించి వేగంతో వాహనాలు నడిపినా, రహదారులను ఆక్రమిస్తూ వాహనాలను నిలిపినా ఠాణా నుంచే వారిని హెచ్చరించేలా ప్రధాన కూడళ్లలో కెమెరాలతోపాటు మైక్‌సెట్లను ఏర్పాటుచేయనున్నాం. సూచనలు ఠాణా నుంచే సంబంధిత వ్యక్తులకు నేరుగా జారీ చేయవచ్చు. అనుమానిత వ్యక్తుల కదలికలను గుర్తించడంతోపాటు, అక్రమ ఇసుక రవాణాను అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెండు రోజుల్లో సీసీ కెమెరాల అమర్చి వారం రోజుల్లోపు పూర్తిచేయనున్నాం.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రాయికల్,న్యూస్‌టుడే: మండలంలోని వాగులు, గోదావరి తీరం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల గ్రామీణ సీఐ శ్రీనివాస్‌చౌదరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ అభివృద్ధి కమిటీల పేరిట అక్రమ టెండర్లు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు గ్రామ రక్షక దళాలను యువకులతో బలోపేతం చేయడంతో పాటు నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఐ శివకృష్ణ తదితరులున్నారు.

జాగృతి జిల్లా అధికార ప్రతినిధిగా హరికిరణ్



జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ జాగృతి జిల్లా పూర్తిస్థాయి కమిటీని ఎంపీ కవిత ఆదేశాల మేరకు బుధవారం నియమించినట్లు జిల్లా కన్వీనర్ చెర్లపల్లి అమర్‌దీప్ గౌడ్ తెలిపారు. జిల్లా కోకన్వీనర్లుగా వెల్ముల శ్రీనివాసరావు, తాటిపాముల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధిగా భైరం హరికిరణ్, కోశాధికారిగా మిసాక్‌అహ్మద్, ఆరోగ్య విభాగం జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ రేవతి, రైతు జాగృతి జిల్లా కన్వీనర్‌గా ఏలేటి సత్యనారాయణరెడ్డి, జిల్లా పీఆర్‌వోగా మేకల ప్రవీణ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

పుస్తె మట్టెలు అందజేత

రాయికల్, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన పాడిరైతు కొప్పెల గంగారెడ్డి కూతురు వందన వివాహానికి బుధవారం కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పుస్తె మట్టెలను అందజేశారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు చింతలపెల్లి గంగారెడ్డి, సూపర్‌వైజర్ రాజేష్, ఇన్‌ఛార్జి రాధకృష్ణ, కార్యదర్శి జగన్, శేఖర్ తదితరులున్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక వాణీనగర్‌కు చెందిన ఆరుముళ్ల శ్రీనివాస్ మంగళవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం వైద్యులు అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని సూచించగా సమాచారం తెలుసుకున్న తెరాస నియోజకవర్గ బాధ్యులు సంజయ్‌కుమార్ శ్రీనివాస్‌కు రూ. 10 వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు. పృథ్వీధర్‌రావు, చంద్రమౌళిలు ఆయన వెంట ఉన్నారు.

మంత్రి ఈటెల ఓఎస్‌డీ ప్రత్యేక పూజలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ ఓఎస్‌డీ జక్కుల ప్రసాద్ సారంగాపూర్ మండలంలోని పెంబట్ల, కోనాపూర్‌లోని దుబ్బరాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సర్పంచులు తోడేటి శేఖర్, గుర్నాథం లక్ష్మీలు ఆలయ చిత్రపటాన్ని, ప్రసాదం అందించారు.

పాఠశాలకు బెంచీలు అందజేత

బీర్‌పూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లిలో ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన యువసేన యువజన సంఘం సభ్యులు బెంచీలను అందించారు. ఉప సర్పంచి ఊరడి సత్తన్న ప్యాన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా యువకులు యువజన సంఘం సభ్యులు, వడ్లూరి రవి, ఉప్పు నాగయ్య, గ్రామస్థులను ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్, భూక్య అశోక్‌రాథోడ్, ఉపాధ్యాయులు అభినందించారు.



లఘుచిత్రాన్ని ఆవిష్కరిస్తున్న కొప్పుల

'జనగణమన' లఘుచిత్రం ఆవిష్కరణ

జగిత్యాల పట్టణం: ఎంవీ క్రియేషన్స్ బ్యానర్‌పై సింగారపు మల్లిక్‌తేజ నిర్మాణ సారథ్యంలో రూపొందించిన 'జనగణమన' లఘుచిత్రాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. కుటుంబం కంటే దేశ సేవే ప్రధానమని భావించే ఓ సైనికుని కథను లఘుచిత్రంగా మలిచిన మల్లిక్‌తేజ, పర్యవేక్షకుడు మహిపాల్‌ను ఈశ్వర్ అభినందించారు. కాగా ఈ లఘు చిత్రానికి కళాకారుడు నరసింహ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాదినేని రాజేందర్, హరీష్, అశోక్, బుర్ర రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న జయంతి గోడపత్రిక ఆవిష్కరణ

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా గౌడసంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్, నాగుల కిషన్‌గౌడ్, బి.శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ల మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో తనిఖీలు



సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారులు

రాయికల్: గ్రామాల్లో ప్రతి బుధవారం ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రత్యేక తనిఖీలు ఉంటాయని డీఆర్డీఏ పి.డి. అరుణశ్రీ అన్నారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ప్రతి మండలంలో బుధవారం మండల స్థాయి అధికారుల బృందంతో ఏదేని ఒక గ్రామంలో హరిత హారంతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇతర సంక్షేమ పథకాల అమలు తీరుపై తనిఖీలు ఉంటాయన్నారు. బుధవారం తొలి సారిగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు మండలంలోని చింతలూరు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. హరితహారం గుంతలు తవ్వి వదిలివేయడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే మొక్కలు నాటారు. అటవీ ప్రాంతాలలో మొక్కలు నాటాలని సూచించారు. గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు పెట్టడంలేదని గుర్తించడంతో పాటు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉండటంతో చర్యలకు ఆదేశించారు. అంతకు ముందు ఆయా గ్రామాలలో నోడల్ అధికారులు హరితహారం మొక్కలకు నీళ్లను పోశారు. కార్యక్రమంలో సర్పంచి కదుర్ల లక్ష్మి, డీఈవో వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్వో నరేందర్‌రావు, తహసీల్దారు చంద్రప్రకాష్, ఎంపీడీవో బాలె శివాజీ, ఎంఈవో శ్యాంసుందరచారి పలు శాఖల అధికారులు తదితరులున్నారు.



రాయికల్‌లో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎంఆర్ టీకాలపై అవగాహన ర్యాలీ

రాయికల్ పట్టణం: తట్టు,రుబెల్లా వ్యాధుల నిర్మూలనకు 9 నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయించాలని కోరుతూ రాయికల్‌లో బుధవారం ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నవారు, గతంలో తట్టు, రుబెల్లా నివారణలో అలర్జీకి గురైనవారు ఈ టీకాను వేయించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకన్న, చైతన్యసుధ, ప్రవీణ్‌చంద్ర సిబ్బంది శ్రీధర్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 22 నుంచి క్రీడా ఉత్సవాలు

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల మండల (అర్బన్) స్థాయి క్రీడా ఉత్సవాలు ఈనెల 22 నుంచి మినీస్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి నారాయణ తెలిపారు. 14 ఏళ్ల నుంచి 17 సంవత్సరాలలోపు బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వీటికి సంబంధించి అర్బన్, మండలంలో పనిచేసే ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పీడీ, పీఈటీలతో ఈనెల 18న సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో వివరించారు.

నలుగురిపై కేసు నమోదు

ధరూర్(జగిత్యాల గ్రామీణం): జగిత్యాల మండలం ధరూర్ శివారులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను జగిత్యాల రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ. కిరణ్‌కుమార్ తెలిపారు. వారిని బుధవారం కోర్టులో హాజరపరుస్తామని ఎస్సై తెలిపారు.

EENADU CLASSIFIEDS

BUSINESS SERVICES

BUSINESS OFFER

తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఉంటూ పేపర్ ప్లేట్స్ తయారుచేసే మెషిన్లు కలవు. ముడిసరకు ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం, అగ్రిమెంట్ కలదు, Govt. రిజిస్ట్రేషన్. సాయి విగ్నేష్ ఏజెన్సీస్, ✆ 99630 02088.

COMPUTER EDUCATION

MULTIMEDIA

ARENA యానిమేషన్‌లో విద్యార్థిగా చేరండి. ఉద్యోగంతో వెళ్ళండి! 10th/ ఇంటర్/ డిగ్రీ (P/F) అయిన వారికి శుభవార్త! గత 20 సం॥లుగా 20 దేశాలలోని 5 లక్షలకుపైగా విద్యార్థులకు నిరుద్యోగులకు "మల్టీమీడియా యానిమేషన్ & సినీగ్రాఫిక్స్ (VFX)" కోర్సులో శిక్షణనిచ్చి దేశవిదేశీ సంస్థలలో & సినీ పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పిస్తున్న ఏకైక సంస్థ. అరీనా యానిమేషన్- ఇప్పుడు మన కరీంనగర్ బ్రాంచి వార్షికోత్సవం సందర్భంగా మొదటి 10 అడ్మిషన్లకు 50% వరకు ఫీజు రాయితీ (లేదా) ఫ్రీ Laptop# సెల్: 99513 77744.

EDUCATION

DISTANCE EDUCATION

ఒకే సం॥లో ఇంటర్/ డిగ్రీ/ SSC: Direct 10th, Inter, B.A., B.Com, BSc, BLisc, MA, M.Com, MSc, MLisc, MBA, Diploma, B.Tech (All Courses Regd UGC & DEC) Micro Chip Study Circle, MM thota, KNR ✆ 94405 21935/ 97005 59923.

MARRIAGE SERVICES

మీ జీవితాంతం తోడుంటారనుకున్న జీవిత భాగస్వామి దూరమయ్యారని చింతించకండి. 1వ, 2వ, లేట్ మ్యారేజ్‌లకు & అన్ని కులాల పెండ్లి సంబంధాలకై సంప్ర॥ హరిహర మ్యారేజ్ బ్యూరో, KNR. Cell: 98496 51552.

వైశ్య పెళ్ళి సంబంధాలు
వైశ్య వధూవరుల 8వ పరిచయ వేదిక 27-08-2017 డాక్టర్స్, ఇంజనీర్స్, వ్యాపారస్థులకు, ఏలాంటి కమీషన్ లేకుండా ఒకే రిజిస్ట్రేషన్ ఫీజుతో ప్రతి నెల చివరి ఆదివారం 10 వేదికలు
సుమంగళి సేవా సంస్థ
నిజామాబాద్, సెల్: 9246913222

PERSONAL CLASSIFIEDS

LOST

Azmera Arun, S/o. Bikna, Vill: Rangampet, Mdl: Virnapally అనబడే మా యొక్క 10th & Inter Memoలు ఎల్లారెడ్డిపేట నుండి వీర్నపల్లికి వెల్తుండగా మార్గమధ్యలో పోయినవి. దొరికినవారు. సంప్ర॥ 88971 38586.

ఎల్లాల మల్లారెడ్డి, S/o. రాంరెడ్డి, Vill: ఆర్నకొండ, Mdl: చొప్పదండి. ఆర్నకొండ నుండి చొప్పదండికి బస్సులో వస్తుంటే మార్గమధ్యలో పట్టా పాస్‌బుక్ నెం. 352 టైటిల్ డీడ్ పడిపోయినవి. దొరికినవారు సంప్ర॥ 95509 58664.

ఎల్లాల సత్తమ్మ, W/o. మల్లారెడ్డి, Vill: ఆర్నకొండ, Mdl: చొప్పదండి. ఆర్నకొండ నుండి చొప్పదండికి బస్సులో వస్తుంటే మార్గమధ్యలో పట్టా పాస్‌బుక్ నెం. 286, టైటిల్ డీడ్ పడిపోయినవి. దొరికినవారు సంప్ర॥ 95509 58664.

REAL ESTATE

HOUSE FOR SALE

శామీర్‌పేట దగ్గర విల్లాప్లాట్స్ & HMDA గేటెడ్ కమ్యునిటీలో 2 BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధర రూ॥ 24 లక్షలు. 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. స్కైవే, జీనోమ్ వ్యాలీ, Hyd. ✆ 77020 16545.

LAND FOR SALE

KNR to జగిత్యాల రోడ్‌లో వెంకటాయిపల్లి స్టేజి వద్ద హైవే రోడ్‌కు 250 మీటర్ల దూరంలో సర్వీస్ రోడ్ ఫేసింగ్ ఆనుకొని 4 ఎకరముల భూమి అమ్మబడును. ఇండస్ట్రీస్‌కు, పౌల్ట్రీలకు, స్కూల్స్, కాలేజీలకు అనుకూలంగా ఉండును. (జగిత్యాల జిల్లా పరిధిలో కలదు). సంప్ర॥ 85002 09936/ 85002 2093.

JOBS

Wanted Teachers to Teach All Subjects I to VII Classes E/M, Karimnagar. Contact: 94404 69550.

జాబ్‌మేళా. Q: 10th - P.G (M/F) Telecallers, Executives, Team Leasers, Supervisors (Fresh/ Exp) కావలెను. జీతం: 12,000 to 22,500/- (TA+DA) జిల్లా, మండలాల వారీగా ఫ్రాంఛైజ్, డీలర్లు కావలెను. 97018 86898.

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో ప్రముఖ పత్తిమిల్లులో పనిచేయుటకు అనుభవం గల Tally వచ్చిన కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. జీతం: 10,000 సంప్ర॥ 90307 39639.

అర్జంటుగా కావలెను షంషాబాద్ HYD ఏరియాలలో పనిచేయుటకు క్యాంటిన్ బాయ్స్ హౌస్ కీపర్స్, కార్గో సూ॥వైజర్స్ కావలెను. అర్హత: 10th-డిగ్రీ ఆకర్షణీయమైన జీతం రూం + భోజనం ఫ్రీ నెలకు 19రోజులు డ్యూటీ 96668 77949.

మా హాస్పిటల్ నందు పని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్ కావలెను. Bio-Data తో నేరుగా సంప్రదించండి. సూర్య నర్సింగ్ హోమ్, CVRN రోడ్, కరీంనగర్.

Hydలోని ప్రముఖ లి॥కం॥లకై హెల్పర్స్, ప్యాకర్స్, క్యాటరింగ్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. జీ: 13-18 వేలు. రూం+మీల్స్ ఫ్రీ. చదువు లేకున్నా జాబ్ సంప్రదించండి. ✆ 9550082383

S.K.V.R కంపెనీలో పనిచేయుటకు BSc (కెమిస్ట్రీ), ITI ఆల్‌ట్రేడ్స్, హెల్పర్స్ ప్యాకింగ్ బాయ్స్ సూపర్‌వైజర్స్, లేడిటెలికాలర్స్ కావలెను. జీతం:10000 To 17000/-PM డైరెక్ట్ ✆ 9553650060/ 9553633437

TV 24x7 న్యూస్ ఛానల్‌లో పనిచేయుటకు న్యూస్ రిపోర్టర్స్ కావలెను. Q: ఇంటర్, డిగ్రీ జీతం: 18,000 ✆ 9703561149, 9676452995.

లైఫ్ స్టయిల్ ఫర్నీచర్స్ శనివారం వీక్లి మార్కెట్ కరీంనగర్‌లో పనిచేయుటకు స్వీపర్స్ (2) (కరీంనగర్ లోకల్ వారికి ప్రాధాన్యత) జీతం: 3500/-. స్వయంగా సంప్రదించండి.

వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు (రిటైర్డ్ RTC) డ్రైవర్స్ & హెల్పర్స్ కావలెను. రిటైర్డ్ RTC డ్రైవర్లకు ప్రాధాన్యత కరీంనగర్. Contact: 79979 97129.

ప్రముఖ DTH కంపెనీ Airtel Digital TVకి మండలాల వారీగా Technicians కావలెను. అవసరం అయితే ట్రైనింగ్ ఇవ్వబడును. ఆసక్తి గలవారు సంప్రదించగలరు. Cell: 90001 81822, 99894 96804.

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

కరీంనగర్ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పనిచేయుటకు డోర్ డెలివరి బాయ్స్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర॥ 96520 16565.

కరీంనగర్‌లో ఆదర్శ మారుతి డ్రైవింగ్ స్కూల్లో పనిచేయుటకు మార్కెటింగ్ Ex M/F. Salary 5000 to 8000/- + Mobile+ Petrol + Incentive. మరియు డ్రైవర్స్ Salary 7000/-. సం॥ 85558 56622.

కరీంనగర్(భగత్‌నగర్)లోని కిరణ్ వాటర్ ప్లాంట్‌లో ఆటోల మీద పోయి క్యాన్లు వేయుటకు ఆటోడ్రైవర్ మరియు వర్కర్ కావలెను. డ్రైవర్‌కు జీతం 8000/- వర్కర్‌కు జీతం 6000/- సంప్ర: ✆ 90822 25555.

MNC కంపెనీలో పని చేయుటకు యువతీ యువకులు కావలెను. అర్హత: 7th-డిగ్రీ, జీతం: 5500 నుండి 10000 వరకు. రూం, భోజనం ఫ్రీ. సంప్ర: 95730 70966, 89785 56751.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



రాయపట్నం పురాతన వంతెన వద్ద గోదావరి



ధర్మపురి వద్ద నదిలో పెరిగిన వరద

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు

గోదావరిలో స్వల్పంగా పెరిగిన నీటి మట్టం

రాయపట్నం పురాతన వంతెనకు అడుగు లోతులో వరద

ధర్మపురి, న్యూస్‌టుడే: రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ధర్మపురి, రాయపట్నం ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. నిన్నటివరకు బోసిపోయి పాయలాగా పారిన గోదావరికి పై ప్రాంతాల్లోని కడెం, ఇతర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం పూర్తిగా నీటి గలగలలతో నిండుగానే ప్రవహిస్తోంది. రాయపట్నం వద్ద ఎల్లంపల్లి నిలుస్తున్న దృష్ట్యా ఇకపై పడే వర్షాలతో ధర్మపురి, రాయపట్నం వద్ద వరద నీరు నిలిచే అవకాశముందని తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ధర్మపురి మండలం రాయపట్నం పురాతన వారధి కింద అడుగు లోతులో గోదావరి ప్రవహించింది. రెండు రోజుల కిందటి వరకు నాలుగు అడుగు లోతులోనే ఉండేది. ప్రస్తుతం వర్షాలతో నిండుగా నీరు వస్తున్న దృష్ట్యా ఇంకా రాయపట్నం పురాతన వంతెనపైకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ధర్మపురి వద్ద మడుగులుగా ఉన్న నది నేడు నిండుగా ప్రవహిస్తోంది. భక్తుల స్నానాలకు మరింత అనుకూలంగా మారింది.

ఆసుపత్రిలో సదుపాయాలపై ఆరా



ప్రసూతి విభాగంలో బాలింతలతో మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణభాస్కర్

సిరిసిల్ల పట్టణం, న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ కృష్ణభాస్కర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి విభాగానికి వెళ్లి బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, కేసీఆర్ కిట్ ద్వారా బాలింతలకు అందుతున్న నగదు ప్రోత్సాహకంపై తెలుసుకున్నారు. ప్రసూతి విభాగంలోని చాలా మంది మహిళలు తమ ఖాతాలో ప్రసవానంతరం ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం ఇంకా జమ కాలేదని తెలిపారు. ఈ విషయంపై అక్కడే ఉన్న జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు తిరుపతి స్పందించి, కేసీఆర్ కిట్ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 475 లబ్ధిదారులకు కేసీఆర్ కిట్ అందించామన్నారు. వీరిలో 412 మందికి నగదు ఆర్థికసాయం వారి ఖాతాలోకి నేరుగా బదిలీ చేశామన్నారు. ప్రధాన కార్యాలయంలో 52మంది లబ్ధిదారులకు సంబంధించి చెల్లింపునకు అనుమతి రావాల్సి ఉందన్నారు. 11 మంది లబ్ధిదారులు ఆధార్‌కార్డులు, బ్యాంకుఖాతాలు ఇవ్వకపోవడం వల్ల చెల్లింపు ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. బ్యాంకులకు వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో లబ్ధిదారుల ఖాతాలో జమ ఆలస్యం జరిగి ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ లబ్ధిదారులతో కేసీఆర్ కిట్ కార్యక్రమంపై వారికి రావాల్సిన ప్రయోజనాలను వివరించారు.

ఇసుక అక్రమ రవాణాదారులపై పీడీయాక్టు

కరీంనగర్ గ్రామీణ ఏసీపీ తిరుపతి

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీయాక్టును అమలు చేస్తామని కరీంనగర్ గ్రామీణ ఏసీపీ వి.తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. నాలుగు రోజులుగా కొనసాగిన దాడుల్లో ఎలగందల్‌లో 427 లారీల, గన్నేరువరంలో 40 లారీల అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రెవెన్యూ, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎండీసీ) అధికారుల సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత జనవరి నుంచి తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న 316 ట్రాక్టర్లు, మూడు లారీలు, చొప్పదండి సర్కిల్‌లో 60 ట్రాక్టర్లు, నాలుగు టిప్పర్లు, కరీంనగర్ గ్రామీణ సర్కిల్‌లో 172న ట్రాక్టర్లు, 21 లారీలు, కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరధిలో 106 లారీలు, గన్నేరువరంలో 42 లారీలను పట్టుకుని రెవెన్యూ, టీఎస్ఎండీసీ అధికారుల సమక్షంలో సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. టీఎస్ఎండీసీ అధికారులు ఇసుక అక్రమ రవాణాదారులకు రూ.88.30లక్షల జరిమానా విధించారని చెప్పారు. మొదటిసారి పట్టుబడితే ఐదువేలు, రెండోసారి పట్టుబడితే 10 వేలు, మూడోసారి పట్టుబడితే 15వేలు జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఐపీసీ 379 కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తరచూ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని చెప్పారు. కొందరు అక్రమ రవాణాదారులపై పీడీయాక్టు అమలు చేసేందుకు రంగం సిద్ధం చేశామని అన్నారు.

106 లారీల ఇసుక స్వాధీనం

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఇసుక అక్రమ నిల్వలపై పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడులను ముమ్మరం చేశారు. ఎలగందులతో పాటు ఖాజీపూర్ గ్రామం ఐలవానిపల్లెలో ఇసుక డంపులను గుర్తించారు. పోలీసులు, రెవెన్యూ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ సిబ్బంది బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేబిల్లు పొందిన 106 లారీల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక లోడింగ్ చేశారు. అక్రమ నిల్వలను పూర్తిగా తొలగించే వరకు దాడులు కొనసాగుతాయని రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

ధర్మపురి గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పలు కోర్సులుకు ఉచిత శిక్షణనిచ్చి సంబంధిత రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ప్రకటన వెలువరించారు. స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ మరియు అకౌంటెన్సీ, రిటైల్ హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటీషియన్(మహిళలకు) బీపీవో కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు కలిగి, పదో తరగతి నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆయా మండలాల్లోని మహిళా సమాఖ్య కార్యాలయాల్లో వివిధ తేదీల్లో ఈ కింద నిర్వహించే మండలాల్లో ఎంపిక కార్యక్రమానికి విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డుతో హాజరు కావాల్సి ఉంటుంది.

ఆగస్టు 17: ధర్మపురి, బుగ్గారం ధర్మపురి మండల సమాఖ్య కార్యాలయంలో, రాయికల్, మల్లాపూర్ రాయికల్ సమాఖ్య కార్యాలయంలో.

ఆగస్టు 19: గొల్లపల్లి, వెల్గటూరు గొల్లపల్లి సమాఖ్య కార్యాలయం, మల్యాల్, పెగడపల్లి మల్యాల్ సమాఖ్య కార్యాలయంలో

ఆగస్టు 21: ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మెట్‌పల్లి సమాఖ్య కార్యాలయం, కోరుట్ల, కథలాపూర్ కోరుట్ల సమాఖ్య కార్యాలయంలో ఎంపిక కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంటుంది.



ఎరువుల తయారీని పరిశీలిస్తున్న కమిషనర్, డీఈఈ, శానిటరిఇన్‌స్పెక్టర్

తడిపొడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ

కోరుట్ల, న్యూస్‌టుడే: మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలో సేకరించిన తడి, పొడి చెత్తతో సెంద్రియ ఎరువుల తయారీ చేపడుతున్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి, డీఈఈ ప్రభాకర్‌రెడ్డి ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజయ్యలు ఏఖీన్‌పూర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డులో ఎరువుల తయారీని పరిశీలించారు. తడి, పొడి చెత్త బీడీల ఆకులను వేరుగా సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుండీలో నిల్వ ఉంచుతున్నారు. పట్టణ ప్రజలు మున్సిపల్ చెత్త వాహనాలకు తడి, పొడి చెత్త బీడీల ఆకు వేరువేరుగా ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. సేంద్రీయ ఎరువుతో కొంత మందికి ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

జమ్మికుంటలో విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ దాడులు

కల్తీ కారం-పసుపు పట్టివేత-రూ. లక్ష గుట్కా స్వాధీనం

పటికను వినియోగిస్తున్న ఆయిల్ దుకాణం సీజ్


దాడులు నిర్వహించగా బయటపడ్డ కాలం చెల్లిన సామగ్రి

జమ్మికుంట: కల్తీ విక్రయాలు, నిషేధిత గుట్కా విక్రయాలు, కాలం చెల్లిన, నిషేధిత సామగ్రిని విక్రయిస్తున్నారనే సమాచారంతో జమ్మికుంటలో బుధవారం కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ సీఐ గౌస్‌బాబా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ప్రత్యేకాధికారి అమృతశ్రీ, ఎస్సైలు కిరణ్, నాగరాజుల ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు చేశారు. స్థానిక పాతమార్కెట్ ఏరియాలో ఆర్ఎస్‌కే ఏజెన్సీలో కాలం చెల్లిన పలు రకాల కాస్మొటిక్స్, సామగ్రిని నిల్వ చేసిన దుకాణం, గోదాంలో రూ.10లక్షల విలువ చేసే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు కొండె రమేష్ నిల్వ చేసిన సామగ్రిని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. స్థానికంగా ఆయిల్ మిల్లును నిర్వహిస్తున్న బచ్చు వీరమల్లు మిల్లుపై అధికారులు దాడులు చేశారు. యంత్రాల ప్రాంతంలో పటిక ఉండటం గుర్తించామని, పటికతో కల్తీ చేసి విక్రయిస్తున్నారని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అమృతశ్రీ చెప్పారు. ఆయిల్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు. స్థానికంగా మహాగణేష్ ఫ్లోర్ మిల్లులో 300కిలోల కల్తీ కారం, 20కిలోల కల్తీపసుపు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. జమ్మికుంట పాత అంబేడ్కర్ రోడ్డు సమీపంలో రెండ్ల మురళి, సమ్మయ్యలు విక్రయించేందుకు నిల్వచేసిన రూ.1లక్ష విలువ చేసే గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సాయినగర్‌లోని మహేశ్వర కిరాణంలో అక్రమంగా నిల్వ చేసిన 5క్వింటాళ్ల రేషన్ బియ్యం, 18లీటర్ల కిరోసిన్, రూ.5వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కొత్తపల్లి వద్ద తమిళనాడు నుంచి వచ్చి నిర్వహిస్తున్న పాండు కాస్మొటిక్స్ దుకాణంపై దాడులు చేసి, రూ.1లక్ష విలువ చేసే కల్తీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. జమ్మికుంటకు చెందిన మిర్యాలకారీ రాజు నిల్వ చేసిన 80 లీటర్ల కిరోసిన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాజు ఆర్ఎస్‌కే ఏజెన్సీని నిర్వహిస్తూ ముంబయి నుంచి వచ్చి స్థానికంగా పలు రకాల విక్రయాలు చేస్తున్నారని, సుమారు రూ.10లక్షల విలువ చేసే కాలం చెల్లిన లేబుళ్లు లేని సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రవి, రాజశేఖర్, నిల్, కర్ణాకర్‌లు పాల్గొన్నారు.


కారంపొడి నమూనాలు, వివరాలు సేకరిస్తున్న ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ అమృతశ్రీ

తినుబండారాల తయారీ కేంద్రంపై...

జమ్మికుంట గ్రామీణం: రామన్నపల్లి శివారులోని తినుబండారాల తయారీ కేంద్రంపై బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అమృతశ్రీ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పిల్లలు తినే వాటిలో రంగులు వాడితే వారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నాణ్యమైనవి మాత్రమే తయారు చేయాలని తినుబండారాల కేంద్రం యజమానికి సూచించారు. మిఠాయిల నమూనాలు సేకరించారు. ప్రయోగశాలకు పంపి వచ్చిన నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ గౌస్‌బాబా, ఎస్సైలు సంతోష్, నాగరాజు, కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన రాకేష్

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: యైటింక్లయిన్‌కాలనీలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం కాలనీలోని పోస్టాఫీస్ ఏరియాలో ఒకే ద్విచక్రవాహనంపై మండల రాకేష్(24), ఎస్. నరేష్, మల్లేష్ ప్రయాణిస్తున్నారు. ప్రధాన చౌరస్తాలో ఉన్న పోలీసులు వారిని ఆపే ప్రయత్నం చేయగా తప్పించుకోవడానికి మరో వీధి మీదుగా వెళ్తూ మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టారు. ఈ క్రమంలో రోడ్డుపక్కన ఉన్న చెత్తకుండీని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం నడుపుతున్న రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న పోలీసులు 108లో గోదావరిఖనికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా పెద్దపల్లి వద్ద మృతి చెందాడు. రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన రాకేశ్ ఇంజినీరింగ్ చదివి ఇంటివద్ద ఉంటున్నాడు. అతడి తండ్రి సంపత్ సింగరేణిలో ఒప్పంద కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వల్పంగా గాయపడ్డ నరేష్, మల్లేష్ గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంపై గోదావరిఖని రెండో పట్టణ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ఎమ్మెల్యే గంగులపై కేసు కొట్టివేత

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై దాఖలైన కేసును కొట్టివేస్తూ కరీంనగర్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్(ఎస్ఈఆర్) రాజు తీర్పు చెప్పారు. 2006 నవంబరు 27న లోక్‌సభ ఎన్నికల నియమావళి అమలులో ఉండగా స్థానిక మున్సిపల్ కార్పొరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న తెలుగుదేశం అభ్యర్థులైన గంగుల కమలాకర్, బత్తుల వెంకన్న ఎన్నికల అభ్యర్థి ఎల్.రమణ గురించి ప్రచారం చేస్తూ.. పట్టణంలో ఫ్లెక్సీ బోర్డులు, బ్యానర్లు అనుమతి లేకుండా కట్టారని కరీంనగర్ ఎమ్మార్వో శ్యాంప్రసాద్‌లాల్ రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసరావు వీరిద్దరిపై కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి రాజు బుధవారం గంగులపై దాఖలైన కేసులో నేరం రుజువు కాకపోవటంతో నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో మరో నిందితుడు బత్తుల వెంకన్న మృతి చెందటంతో గతంలోనే తొలగించారు.

మహిళపై అసభ్యంగా ప్రవర్తించినందుకు జైలు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉన్న ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన నిందితునికి రెండేళ్ల కఠిన జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కుష తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన మహిళ(26) ప్రభుత్వ ఆసుపత్రిలో తాత్కాలిక ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. 2016 ఆగస్టు 13న సాయంత్రం మహిళ ఒంటరిగా తన గదిలో విధులు నిర్వహిస్తుండగా, పట్టణంలోని కోతిరాంపూర్‌కు చెందిన బల్లు వెంకటేశ్ అదును చూసి గదిలోకి ప్రవేశించాడు. తలుపులు దగ్గరగా వేసి, ఆమె చేయిపట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె అరుస్తూ ధైర్యం చేసి సిరంజితో తిరుగుబాటు చేయగా, నిందితుడు పారిపోయాడు. మహిళ ఫిర్యాదు మేరకు రెండో ఠాణా ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి కుష బుధవారం నిందితుడైన బల్లు వెంకటేశ్(30)కు రెండేళ్ల కఠిన జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అట్రాసిటీ కేసు నమోదుపై డీఎస్పీ విచారణ

బోయినపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై నీలోజిపల్లి గ్రామంలో వేములవాడ డీఎస్పీ చంద్రశేఖర్ బుధవారం విచారణ చేపట్టారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన శివయ్య కరీంనగర్ జిల్లా కేంద్రంలో పేయింటింగ్ వేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆర్అండ్ఆర్ కాలనీ నీలోజిపల్లిలో పేయింటింగ్ వేసేందుకు అంగీకరించి ఇంటి యజమాని అనుముల బాలకిషన్ వద్ద డబ్బులు తీసుకున్నాడు. పేయింటింగ్ పూర్తి చేయకపోవడంతో వారికి వాగ్వాదం జరిగింది. కులం పేరుతో దూషించాడని శివయ్య ఫిర్యాదు మేరకు బాలకిషన్‌పై కేసు నమోదు చేశారు. ఇరువర్గాలను, స్థానికులను విచారించి డీఎస్పీ వివరాలు నమోదు చేసుకున్నారు. వేములవాడ గ్రామీణ వలయాధికారి మాధవి, ఎస్సై ఎం.వి.సురేందర్‌రెడ్డి ఉన్నారు.

జాతీయ అన్వేషిక ప్రయోగ పరీక్ష 19న

కరీంనగర్ విద్యా విభాగం : పాఠశాల స్థాయి విద్యార్థుల్లో సైన్స్ ప్రయోగాలపై ఆసక్తిని పెంచేందుకు ఐఐటీ కాన్పూర్‌కు చెందిన వర్మ రూపొందించిన జాతీయ అన్వేషిక ప్రయోగ పరీక్షను ఈ నెల 19న కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి బి.ఓదెలు కుమార్, సైన్స్ ఫోరం అధ్యక్షుడు పర్వరాములు, కార్యదర్శి రాంకిషన్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షల్లో భాగంగా జిల్లా స్థాయిలో దీన్ని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులని, ప్రతి పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులకు మించకుండా ఈ పరీక్షలో పాల్గొనవచ్చని వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల స్టడీ ధ్రువీకరణ పత్రాలను స్థానిక ఉదయ్ కలర్ ల్యాబ్ లేదా సాధన స్కూల్లో అందజేయాలని కోరారు.

మహిళను మభ్యపెట్టి నగదు చోరీ

మెట్‌పల్లి ఆంధ్రాబ్యాంకులో ఆగంతకుల చేతివాటం


మహిళ నుంచి డబ్బులు తీసుకుంటున్న వ్యక్తి (సీసీ కెమెరా దృశ్యం)

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి ఆంధ్రాబ్యాంకులో ఓ మహిళ నుంచి సినీఫక్కీలో నగదు కాజేసిన సంఘటన బుధవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరపేటకు చెందిన శ్రీరాం సమాఖ్య మహిళా మండలి సభ్యురాలైన శ్రీరాం కవిత వారి ఖాతాలో రూ.లక్ష జమ చేద్దామని ఆంధ్రాబ్యాంకుకు వచ్చింది. ఉదయం బ్యాంకు తెరవగానే జమ చేసేందుకు చేతిలో డబ్బులు పట్టుకుని క్యూలో నిలబడింది. కొద్దిసేపటికి వెనుక నుంచి ఇద్దరు అపరిచిత వ్యక్తులు వచ్చారు. డబ్బులు పట్టుకున్న మహిళను పలకరించి డబ్బులు సరిచేసుకొమని నమ్మబలికి, ఆమె చేతిలోని నగదును తీసుకుని లెక్క పెడుతుండగా, అదే సమయంలో మరో వ్యక్తి ఆమెను మాటల్లో పెట్టాడు. ఇంతలో తొలుత డబ్బులు తీసుకున్న వ్యక్తి అందులో కొంత మొత్తాన్ని కాజేసి మిగతా డబ్బు ఆమెకు ఇచ్చాడు. డబ్బులను బ్యాంకులో కడుతుండగా లెక్క పెడితే రూ.18,500లు తక్కువ రావడంతో అసలు విషయం తెలిసింది. ఇద్దరు అపరిచితులు డబ్బును కాజేశారని తెలుసుకున్న బాధితురాలు లబోదిబోమంది. ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. బ్యాంకు మేనేజరు వివేకానంద సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు మహిళను మభ్యపెట్టి డబ్బు కాజేసిన దృశ్యాలు కనిపించాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.


ప్రమాదం నుంచి బయటపడ్డ స్వరూప


గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యం

ప్రాణహిత నదిలో ఇద్దరు బాలికల గల్లంతు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: జయశంకర్ జిల్లా కాళేశ్వరానికి పొరుగున ఉన్న మహారాష్ట్ర సిరొంచా సరిహద్దున గల ప్రాణహిత నదిలో పడి ఇద్దరు తెలంగాణకు చెందిన బాలికలు గల్లంతయ్యారు. సిరొంచా సీఐ సూపే వివరాల ప్రకారం... గత 15 రోజులుగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన పస్తం తిరుపతి, జయశంకర్ జిల్లా భూపాలపల్లికి చెందిన కడబంజి సారయ్య తమ కుటుంబసభ్యులతో ప్రాణహిత నది ఒడ్డున తాత్కాలికంగా గుడారాలు వేసుకొని, చిరు వ్యాపారం నిర్వహిస్తున్నారు. బుధవారం తిరుపతి ఇద్దరు కుమార్తెలు స్వరూప, స్వప్నలతో కలిసి సారయ్య కుమార్తె వెంకటరమణ రోజులాగే పక్కనే ఉన్న నదిలో స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో ముగ్గురు జారిపడగా స్వరూప ప్రమాదం నుంచి బయటపడి దరికి చేరింది. స్వప్న (11), వెంకటరమణ (11) ప్రవాహంలో గల్లంతయ్యారు. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

రాయికల్‌లో దొంగ అరెస్టు

రెండున్నర తులాల బంగారం, ద్విచక్రవాహనం, చరవాణి స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: రాయికల్ మండలంలో పలు చోరీలకు పాల్పడిన దొంగను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని బుధవారం జైలుకు పంపించారు. జగిత్యాల గ్రామీణ సీఐ శ్రీనివాస్ చౌదరి తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణంలోని పలు ఇళ్లలో గత నెల 16న చోరీ జరిగింది. అప్పటి నుంచి పోలీసులు పట్టణంలో నిఘా వేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం గ్రామంలోని నగలు విక్రయించేందుకు వచ్చిన నిజామాబాద్ జిల్లా నాగారం గ్రామానికి చెందిన సయ్యద్ ఆజామ్(28) అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకుని విచారించగా అతని వద్ద రెండున్నర తులాల బంగారంతో పాటు ప్యాషన్ ప్రో ద్విచక్రవాహనంతో పాటు ఒక చరవాణిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని కోర్టులో అప్పగిస్తామని సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ శివకృష్ణ, కానిస్టేబుల్ రాజేందర్, కేశవ్ తదితరులు న్నారు.

గూడ్సురైలు కింద పడి గొర్రెలు మృతి


రైలు కింద పడి మృతి చెందిన గొర్రెలు

మెట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి మండలం చింతలపేట శివారులో గూడ్సురైలు కింద పడి సుమారు 30 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు గాజనవేని మల్లయ్య కథనం ప్రకారం వారం కిందట మల్లయ్య 50 గొర్రెలను కొనుగోలు చేసి తెచ్చాడు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ సమీపంలో గొర్రెలను మేపుతుండగా కోరుట్ల వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు హారన్ కొట్టింది. ఆ ధ్వనికి భయపడి గొర్రెలు ఒక్కసారిగా రైల్వే ట్రాక్ పైకి పరుగెత్తి రైలు కింద పడ్డాయి. ఈ సంఘటనలో సుమారు 30 గొర్రెలు మృతి చెందగా, నాలుగైదు గాయపడ్డాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మృతి చెందిన గొర్రెలు రైలు పట్టాలపై చిందరవందరగా పడి ఉన్నాయి. ఉపాధి కోసం వారం కిందట ఒక్కో గొర్రెను రూ.5100లకు కొనుగోలు చేశానని, అవి మృతి చెందడంతో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు మల్లయ్య వాపోయాడు.


కొండగట్టు అంజన్న ఆలయం

తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు భద్రత కరవైంది. నిత్యం వేలాది మంది భక్తులతో కిటకిటలాడే కొండగట్టులో అంచెలవారీగా భద్రతను తొలగించడంతో ప్రస్తుతం హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందే దిక్కుగా మారింది. గతంలో అంజన్న దర్శనానికి వచ్చే మహిళా భక్తులకు మత్తు మందిచ్చి దోచుకొన్న సంఘటనలు అధికంగా జరిగాయి. అంతేకాకుండా మహిళా భక్తులు తిరుగు ప్రయాణంలో బస్సెక్కే సమయంలో బంగారు ఆభరణాలు చోరీ జరిగిన సంఘటనలు ఉన్నాయి. తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిన కొండగట్టు ప్రాంతంలో సరైన పోలీసు బందోబస్తు లేక రద్దీ సమయాల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-న్యూస్‌టుడే, మల్యాల

పెరుగుతున్న రద్దీ... తరుగుతున్న భద్రత

కొండగట్టులో పోలీసు ఔటుపోస్టు రద్దు
భక్తులకు కొరవడుతున్న రక్షణ

ఏపీఎస్పీ బందోబస్తు తొలగించారు

కొండగట్టు గుట్టపైన కొన్నేళ్ల కిందట వైర్‌లెస్ సేవల కోసం రిపీటర్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీని రక్షణ కోసం ఏపీఎస్పీ పోలీసులు పనిచేసే వారు. ప్రస్తుతం రిపీటర్ స్టేషన్ నిర్వహణ కోసం ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లు మాత్రమే పనిచేస్తుండగా పోలీసు రక్షణ తొలగించారు.

ఔట్‌పోస్టునూ తీసేశారు

కొండపైన తరచూ చోరీలు జరగడం, భక్తుల రద్దీ సమయంలో ఎలాంటి తోపులాట చోటుచేసుకోకుండా నిరంతరం భక్తుల రక్షణార్థం దాదాపు పదేళ్ల కిందట పోలీసు ఔటు పోస్టు ఏర్పాటు చేశారు. ఇందులో మల్యాల, కొడిమ్యాల ఠాణాలకు చెందిన సిబ్బంది వంతులవారీగా విధులు నిర్వహించేవారు. ఏఎస్సై లేదా హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లు ఈ ఔటుపోస్టులో విధులు నిర్వహించేవారు. దాదాపు ఏడాది నుంచి ఔటుపోస్టులో సిబ్బందిని నియమించకపోవడంతో ఖాళీగా మారింది. ఈ ఔటుపోస్టు కొనసాగిన సమయంలో కొండపై చోరీలు, ఇతర మోసాలు తగ్గడంతోపాటు భక్తుల రద్దీ సమయంలో ట్రాఫిక్ నియంత్రించేందుకు కృషి చేసే వారు. ప్రస్తుతం కొండపైన ఔటుపోస్టులో సిబ్బంది లేకపోవడంతో శని, మంగళవారాల్లో అధిక సంఖ్యలో వాహనాల్లో వచ్చే భక్తులను నియంత్రించడం సమస్యగా మారింది. కొన్ని సందర్భాల్లో కొండపైన 'వై' జంక్షను వద్ద ఘాట్‌రోడ్డుపై ఇరువైపులా వాహనాలు ఇరుక్కుపోయి హుటాహుటిన వెళ్లి ట్రాఫిక్ నియంత్రించడానికి తంటాలు పడుతున్నారు. భక్తులు ట్రాఫిక్‌లో గంటల తరబడి ఇరుక్కుపోతున్నారు. ఆ సమయంలో మల్యాల ఠాణా నుంచి పోలీసులు లేదంటే హోంగార్డులే శ్రమించాల్సి వుంటుంది.



ఆలయం ముందు గతంలో ఏర్పాటు చేసిన పోలీసు ఔటు పోస్టు గది

కొండకింద పోలీసు సబ్‌కంట్రోలు గదిని కూల్చేశారు

అంజన్న ఆలయానికి వెళ్లే దారిలో కొండగట్టు స్టేజీ వద్ద దాదాపు నాలుగేళ్ల క్రితం ఆలయ నిధులతో పోలీసు సబ్‌కంట్రోలు గదిని నిర్మించారు. ఈ గదిలో ఓ ఎస్సై లేదా హోంగార్డుతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించేవారు. సబ్‌కంట్రోలు గది కొంతకాలం రోడ్డు పైన నిర్మించడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో ఎస్పీ అనంతశర్మ దానిని 6నెలల క్రితం పూర్తిగా తొలగించారు. దీంతో స్టేజీ వద్ద పోలీసు సిబ్బంది నియామకపోవడంతో రోడ్డుపైనే ఆర్టీసీ బస్సులను నిలపడం, కొందరు రోడ్డును ఆక్రమించుకొని దుకాణాలు రోడ్డు పైనే నిర్వహించడంతో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం మల్యాల ఠాణాలో కూడా దాదాపు 12 మంది కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉండటం కూడా కొంత సమస్యగా మారింది. దీంతో గ్రామాల్లో రాత్రిపూట పెట్రోలింగ్ చేయలేకపోతున్నామన్నారు. అటు గొడవలు, చోరీలతో ప్రజలకు రక్షణ కరవైపోయింది. కొండగట్టు అంజనేయస్వామి ఆలయంతోపాటు భక్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడానికి పోలీసు ఔటుపోస్టులు, కంట్రోలు గదులను ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు భక్తులు కోరుతున్నారు.



కొండ కింద (స్టేజీవద్ద) నాలుగేళ్ల కిందట నిర్మించిన పోలీసు సబ్ కంట్రోలు గది (ప్రస్తుతం దీనిని తొలగించారు)


కొండపై 'వై' జంక్షను వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య

ప్రయోగం.. ప్రయోజనం

వ్యవసాయ పీజీ విద్యార్థుల పరిశోధనలు

అన్నదాతలకు ఉపకరించేలా ఆవిష్కరణలు

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: మేలైన వంగడాలు అందుబాటులో లేకపోవడం.. యాజమాన్యలోపాలు.. వెరసి సరాసరి దిగుబడి రావడం లేదు. వీటిని అధిగమించేలా శోధించాలని వ్యవసాయ విద్యార్థులు నిశ్చయించుకున్నారు. వ్యవసాయ పీజీ చేస్తున్న పలువురు విద్యార్థులు ప్రస్తుతం ద్వితీయ సంవత్సరంలో భాగంగా స్వయం పరిశోధన చేపట్టారు. ఉత్తర తెలంగాణలోనే ఏకైక వ్యవసాయ పీజీ కళాశాల జగిత్యాల మండలం పొలాసలో ఉండగా జెనెటిక్స్ ప్లాంట్‌బ్రీడింగ్, అగ్రానమీ, సాయిల్‌సైన్స్‌లలో పీజీ చదువుతున్న విద్యార్థులు పొలాల్లో ప్రయోగాలు చేస్తున్నారు. నూనెగింజల్లో దిగుబడి పెరుగుదల, వరిలో సమస్యల నివారణ, వివిధ పద్ధతుల్లో ధాన్యం ఉత్పత్తి, రసాయన ఎరువుల సమర్థ వాడకం తదితరాలపై ప్రయోగాలు ఎన్నుకున్నారు... పాటుగా తాము ఎంచుకున్న అంశాలు, కర్షకులకు ఉపకరించే సాంకేతిక ఆవిష్కరణపై విద్యార్థులు వివరించారు.


క్షేత్రాల్లో విద్యార్థినులు

సేంద్రియసాగు ప్రధానాంశంగా పరిశోధన

- జి.వినయ్, పీజీ విద్యార్థి

జిల్లాలోని నేలల్లో నత్రజని లోటుండగా భాస్వరం, పొటాష్‌ల ఆవశ్యకత రోజురోజుకు పెరుగుతున్నాయి. చాలా మంది రైతులు తమ నేలల్లోని పోషకాల స్థాయిని తెలుసుకోకుండానే రసాయన ఎరువులను వాడుతున్నారు. దీనివల్ల నేలసారం లక్షణాలు కోల్పోయి రసాయన ఎరువులు వేయకుంటే దిగుబడి రాని పరిస్థితి వచ్చింది. ఎరువులు, పురుగుమందులు, గడ్డిమందులతో పర్యావరణానికి, మనుష్యులు, జీవకోటికి హానికలుగుతోంది. నేలలు నిస్సారంగా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సేంద్రియసాగుపై పరిశోధిస్తుండగా పంచగవ్య, బీజామృతం, జీవామృతం తయారీ, వాడకం, వర్మికంపోస్టు తదితరాలతో సేంద్రియసాగులోని లోటుపాట్లను అధ్యయనం చేసి రైతులు ఆచరించేలా ప్రణాళికను తయారు చేస్తున్నాం. సేకరించిన మట్టి నమూనాల్లో 70 శాతానికిపైగా నేలల్లో సేంద్రియ పదార్థం (0.87 శాతం) అల్పస్థాయిలో ఉన్నట్లు తేలింది. ఇది కనీసం మధ్యస్థాయి (0.87-1.3 శాతం)కు తగ్గకుండా ఉండాలి. దీనిని ప్రమాణం 2.0 శాతానికి తీసుకురాగలిగితే పోషకాలు అందుబాటులోకి వచ్చి నేలలో అనుకూల లక్షణాలు ఏర్పడతాయి.


జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం


రైస్‌బ్రాన్ ఆయిల్ నిమిత్తం పరిశోధిస్తున్న వరిరకాలు

ఉత్పత్తులపై దృష్టిసారించాలి

- బి.ఏడుకొండలు, విద్యార్థి



ఇతర నూనె రకాలకన్నా వరి ఉత్పత్తుల ద్వారా తీసిన నూనె విటమిన్-ఎ కలిగిఉండి శరీరంలో రోగనిరోధక శక్తి పెంచుతుంది. ప్రస్తుతం విపణిలో కొన్నిరకాల నూనెలుండగా రైతులు పండిస్తున్న స్థానిక రకాల్లోనే అధిక నూనెను కలిగిన రకాలను ఉత్పత్తి చేయాలని ప్రయోగాలు చేస్తున్నాం. జగిత్యాల వరి రకాలతోపాటుగా ఇతర 40 వరి రకాల్లో నూనెశాతం హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్షించగా కొన్నింటిలో 11 శాతంగా ఉండగా మరికొన్ని జగిత్యాల రకాల్లో 19.35 శాతంవరకు నూనెశాతం ఉంది. కంపెనీలతో కలిసి అధిక నూనెశాతం కలిగిన వరిరకాలను పండిస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. జగిత్యాల జిల్లాలో పంటకు లక్ష ఎకరాల వరిఉండగా ఉత్తర తెలంగాణ జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. ఈ నేపథ్యంలో వరి ధాన్యాన్ని ఉప ఉత్పత్తులుగా, వాణిజ్య సరళిలో పండించటం స్థానిక రైతాంగానికి ఉపకరిస్తుంది కాబట్టి ఈ దిశగా పరిశోధనలను ఎన్నుకున్నాం.

ప్రతికూల పరిస్థితుల్లో వరిపైరు సాగు

-లావణ్య, పీజీ విద్యార్థిని



జగిత్యాల ప్రాంతంలో వరి ప్రధాన పంటకాగా కూలీల కొరత, వర్షాల్లేక సాగు ఆలస్యం అవుతుంది. అగ్రానమి సబ్జెక్టుద్వారా వరిలో రైతులను సానుకూల అంశాలపై పరిశోధిస్తున్నాం. తెలంగాణ సోన, బతుకమ్మ వరిరకాలు ఆయా ప్రాంతాల్లో అందించే దిగుబడుల తీరును అధ్యయనం చేస్తూ డ్రమ్ సీడరుతో విత్తటం ద్వారా నాట్లు ఆలస్యమైనా అధిగమించడం, విత్తనాలను నానబెట్టి వెదజల్లి విత్తటం తదితరాలను పరిశోధిస్తున్నాం. రసాయన ఎరువులను వివిధ మోతాదులో పంటలను వాడుతూ కలుపు యాజమాన్యం ద్వారా ఏ మేరకు సరాసరి దిగుబడి వస్తాయనేది రైతుల క్షేత్రాలతో సరిపోల్చుతూ శోధిస్తున్నాం. దీనివల్ల ప్రతికూల పరిస్థితుల్లో పంటనుంచి కనీస దిగుబడి పొందే వీలుంది. శాస్త్రవేత్తలుగా లేదా వ్యవసాయాధికారులుగా ఎన్నికైతే రైతులకు సేవ అందించడానికిగాను మాకు ఈ పరిశోధన ఎంతగానో ఉపకరిస్తుంది.


డ్రమ్‌సీడరుతో విత్తుతున్న దృశ్యం

సస్యరక్షణకన్నా చీడపీడల నివారణే ముఖ్యం

- సమీన, పీజీ విద్యార్థిని



స్థానికంగా రైతులు పండిస్తున్న ప్రధాన పంట వరిలో ఇటీవల చీడపీడలు అత్యంత సమస్యగా మారాయి. ముఖ్యంగా ఉల్లికోడు, సుడిదోమ, రసంపీల్చు పురుగులు, తెగుళ్లు పంట దిగుబడులను గణనీయంగా తగ్గిస్తుండగా వీటి నిరోధంను ప్రధాన అంశంగా పరిశోధనకు ఎన్నుకున్నాను. చీడపీడలు ఆశించిన తరువాత సస్యరక్షణ చేపట్టే బదులుగా చీడపీడలు రాకండా చేపట్టాల్సిన పలు పద్ధతులను రైతులు అవలంబించాలన్నదే మా తాపత్రయం. జెనెటిక్స్ ప్లాంట్‌బ్రీడింగ్ అంశంగా చీడపీలను తట్టుకునే వంగడాల రూపకల్పనపై ప్రయోగాలు చేస్తున్నాను. పురుగుమందులు, కలుపు మందుల వాడకం తగ్గితే పర్యావరణానికి మేలు కలుగుతుంది, మన ఆరోగ్యాలూ దెబ్బతినవు.


విత్తనాల రూపకల్పనకు వాడే కర్రలు

రసాయన ఎరువుల వాడకం అత్యంత ప్రధానం

- ఎన్.మమత, విద్యార్థిని





జిల్లాలోని పంటల్లో దిగుబడుల పెరుగుదలకు రసాయన ఎరువుల వాడకం ఎంత ముఖ్యమో ఇవే ఎరువుల మోతాదు తప్పినపుడు పైర్లపై పోషకలోపాలు తలెత్తడం, చీడపీడల ఉద్ధృతి పెరిగి దిగుబడి తగ్గుతుంది. సాయిల్‌సైన్స్ ప్రధాన సబ్జెక్టు అంశంగా ప్రతిరైతు తమ నేలను భూసార పరీక్ష చేయించుకుని సిఫారసు మేరకు రసాయన ఎరువులను వాడాలని సూచిస్తున్నాం. సోయాబీన్‌లో నత్రజని వినియోగం, సల్ఫర్ వాడితే కలిగే ప్రయోజనాలు, ఏ సమయంలో ఎరువులను వేయాలి, నూనెశాతం పెరుగుటకు వాడాల్సిన పోషకాలు తదితరాలను పరిశోధిస్తున్నాం. సిఫారసును బట్టి రైతులు 25 శాతం ఎరువులను తక్కువగా వాడుతూ కనీసం 5-10 శాతం సగటు దిగుబడులను పెంచుకున్నట్లు గుర్తించాం. ఉత్తర తెలంగాణలోని నేలల్లో నత్రజని తక్కువుండగా సేంద్రియ కర్బనశాతం కూడా 0.25 శాతం తక్కువుంది. భాస్వరం, పొటాష్ ఎరువులు నేలల్లో మధ్యస్తం నుంచి ఎక్కువగా ఉన్నాయి. ౨ రైతులు భూసార ఫలితాలు చూసుకుంటే దిగుబడి పెరుగుతుంది.

నూనెగింజలు సహా చిరుధాన్యాల సాగుపెరగాలి

- జి.దివ్య, పీజీ విద్యార్థిని



రైతులందరూ చిరుధాన్యాలు, నూనెగింజలు, పప్పుదినుసుల పంటలస్థానే ఒకటిరెండు వాణిజ్య పంటలను మాత్రమే పండిస్తుండటంతో పంటల వైవిధ్యం, సరళి దెబ్బతింటోంది. ఉత్పత్తుల ధరలు అమాంతం పెరిగి లేదా భారీగా తగ్గి కర్షకులు కనీస పెట్టుబడులను పొందని సందర్భాలు నెలకొంటున్నాయి. అగ్రానమీ ప్రధాన సబ్జెక్టుగా నువ్వులు తదితర నూనెగింజలను లాభసాటిగా పండించే అంశాన్ని ఎన్నుకున్నాను. నువ్వుల్లో అధిక దిగుబడులు, నూనెశాతం పెంచడం, ఫిల్లోడి అల్టర్‌నేరియా తెగుళ్ల నిరోధం ప్రధానాంశాలుగా పరిశోధిస్తున్నాను. ఉన్నాయి. వేరుసెనగ, పొద్దుతిరుగుడు తదితర నూనెగింజల పంటల్లోనూ మెండైన దిగుబడి సాధన ప్రధానాంశంగా ఉంది.


నువ్వు పైరు

నిరుపేద ఇంటి.. పతకాల పంట

కిక్ బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న విద్యార్థిని

జాతీయ, రాష్ట్ర స్థాయిలో 19 పతకాలు సొంతం



సారంగాపూర్, న్యూస్‌టుడే: ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంది.. సౌకర్యాలు లేకున్నా సాధన చేసింది... పోటీ ఎక్కడైనా ప్రతిభ కనబరిచి పతకాలు తెచ్చింది.. నిత్యం ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతుండటంతో పోటీలకు వెళ్లలేని దుస్థితి నెలకొన్నా.. దాతలు సహకారంతో జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ సత్తా చాటుతోంది. పాఠశాల స్థాయి నుంచే కిక్‌బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సత్తా చాటుతూ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటుతూ జాతీయ, రాష్ట్ర స్థాయిలోనే 19 పతకాలు సాధించి సత్తాచాటుతున్న సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బీర్పూరు సుప్రియ అనే విద్యార్థినిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బీర్పూరు సుప్రియ తల్లిదండ్రులు రాజిరెడ్డి, విజయలది వ్యవసాయ కుటుంబం. సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయం నుంచే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధించేది. ప్రస్తుతం జగిత్యాలలో డిగ్రీ చదువుతున్న సుప్రియను పాఠశాల స్థాయిలో సారంగాపూర్‌లో పని చేసిన పీడీ శంకరయ్య ప్రోత్సాహంతో కిక్ బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలే శిక్షణ ఇచ్చారు. అదే స్ఫూర్తితో తరచూ ఎక్కడా పోటీలు నిర్వహించినా పాల్గొంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు 19 పతకాలు సాధించింది.

పోటీలలో పాల్గొంటే బంగారు పతకమే!

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎక్కడ పోటీలు జరిగినా సుప్రియ పాల్గొని పతకం సొంతం చేసుకుంటోంది. ఈనెల 17న కేరళలో జరిగే జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనడానికి వెళ్లింది.

ఆర్థిక ఇబ్బందులతో ముందుకెళ్లడం కష్టంగా ఉంది

-బీర్పూరి సుప్రియ, జాతీయ క్రీడాకారిణి



జాతీయ, రాష్ట్ర స్థాయిలో పోటీలలో పాల్గొనేందుకు వెళ్లాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. క్రీడాకారులకు అందుబాటులో క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేసి వ్యాయామ ఉపాధ్యాయులను నియమిస్తే మరింత మంది విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుతారు.

2013లో మెదక్‌లో నిర్వహించిన కిక్‌బాక్సింగ్ పోటీలలో బంగారు పతకం, 2015లో విజయవాడలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో, 2016లో నిజామాబాద్‌లో నిర్వహించిన 17ఏళ్లలోపు విభాగం వెయిట్‌లో లిఫ్టింగ్ విభాగంలో జాతీయ స్థాయి బంగారు పతకం సాధించింది.

హైదరాబాద్‌లో 2016, 2017లో పలుమార్లు హైదరాబాద్‌లో నిర్వహించిన 17ఏళ్లు, 19 ఏళ్లలోపు విభాగంలో మూడు మార్లు బంగారు పతకం సాధించింది.

2017లో మహారాష్ట్ర, తమిళనాడులో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రజత పతకాలను సొంతం చేసుకుంది. అంతేకాకుండా కిక్ బాక్సింగ్ పోటీలలో 2013లో పంజాబ్, మధ్యప్రదేశ్‌లో, మెదక్‌లో నిర్వహించిన 17ఏళ్లలోపు కిక్ బాక్సింగ్ పోటీలలో సత్తా చాటి బంగారు పతకం సాధించింది.

జాతీయ క్రీడాకారిణికి దాతల అండ

జాతీయ స్థాయిలో రాణిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన బీర్పూరు సుప్రియకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎవరైన దాతలు సహకరిస్తేనే జాతీయ, రాష్ట్ర స్థాయిలో పోటీలలో పాల్గొనాల్సి వస్తుంది. ఇప్పటి వరకు ఎవరో ఒకరు ఆర్థికంగా సహాయం చేస్తేనే పోటీలలో పాల్గొనాల్సి వస్తుంది. ప్రస్తుతం కేరళలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జగిత్యాలకు చెందిన మున్నూరు కాపు ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బైరం హరికిరణ్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయం అందించడంతో పోటీలలో పాల్గొనేందుకు వెళ్లాల్సిన పరిస్థితి.

మేమున్నామని.. నీకేం కాదని

స్నేహితులను ఆదుకుంటున్న మిత్రులు

రాయికల్, న్యూస్‌టుడే: వారంతా చిన్ననాడు కలిసి చదువుకున్నారు.. అందరూ ఆయా రంగాల్లో స్థిరపడ్డారు. ప్రతి ఏడాది కలుస్తూ తమ స్నేహితుల బాగోగులు చూస్తున్నారు. మిత్రులు అకాల మరణం చెందితే కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు ఆపదలో ఉన్న తమ స్నేహితులను ఆదుకుంటున్నారు. రాయికల్ మండలంలోని మిత్రులకు మేమున్నామని భరోసా కల్పిస్తున్న యువకులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.


మిత్రుని కుటుంబానికి సామగ్రి అందజేస్తున్న స్నేహితులు

రాయికల్ ఉన్నత పాఠశాలకు చెందిన 1989-90, 1990-91, 1991-1992, 1992-1993 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సుమారు 150 మంది మిత్రులు ప్రతి ఏటా వేసవిలో తమ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకుని కలుసుకుంటున్నారు. ఇలా గత నాలుగేళ్ల క్రితం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో తమతో కలిసి ఆడిపాడిన చదువుకున్న మిత్రులు దూరమవడంతో వారి కుటుంబాల పరిస్థితి తెలుసుకుని మిత్రులంతా చలించారు. తమ వంతు సాయంగా మిత్రుల కుటుంబాలను ఆదుకోవాలని నిర్ణయించారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి ఆదర్శంగా నిలిచారు.

మిత్రుల కుటుంబాలకు సాయంగా...

యార్ల ప్రసన్న భర్త వెంకటేశ్వర్‌రావు మృతి చెందగా రూ.5 వేల ఆర్థిక సాయం, మరో స్నేహితుడు కోన రాజలింగం మృతి చెందగా ఆయన కూతురు నవ్య పేరిట రూ.30వేల డిపాజిట్ చేశారు. మరో మిత్రుడు కోల రాజేందర్ కూతురు వివాహానికి రూ.10 వేల విలువ చేసే సామగ్రి అందజేశారు.

1990-91 బ్యాచ్‌కుచెందిన విద్యార్థులు తమమిత్రులు భూర్ల ఆంజనేయులు, అంబల్ల రాజరెడ్డి మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.50వేల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసి ఆ బాండ్లను జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

1992-1993 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తమ మిత్రులు కారం గంగాధర్, రాసమల్ల గంగాధర్ మృతి చెందగా రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు.

స్నేహితునికి అండగా

రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2005-2007 ఇంటర్, 2004-05 పదో తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 38 మంది విద్యార్థులు. రాయికల్‌కు చెందిన తమ మిత్రుడు ఎండీ సాజిద్ పాషా ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా అక్కడ అనారోగ్యంతో మూత్ర పిండాలు దెబ్బతిన్నాయి. అసలే పేదరికంతో ఉన్న సాజిద్‌కు తన మూత్ర పిండం దానం చేయడానికి సాజిద్ అమ్మ ఇవ్వడానికి సిద్ధం కాగా ఆసుపత్రి ఖర్చులు లేక పోవడంతో మిత్రులంతా స్పందించారు. తమ మిత్రున్ని రక్షించుకోవాలనే కోరికతో స్నేహితులంతా రూ.1.20 లక్షలు స్వతహాగా ఇవ్వడంతో పాటు దాతల సాయంతో మరో 30 వేలు అందజేశారు. మిత్రుల సాయం అండగా నిలవడంతో సాజిద్‌కు ప్రాణాపాయం తప్పింది. స్నేహం ముందు పేదరికం కూడా ఓడిపోతుందని ఈ మిత్రులంతా నిరూపించారు. స్నేహం అంటే కలిసి తిరగడమే కాదు కష్టాలను పంచుకోవాలని మరో మారు నిరూపించి ఆదర్శంగా నిలిచారు.


సాజిద్ ఆరోగ్యం కోసం ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

ఆపదలో ఆదుకున్నావారే నిజమైన మిత్రులు

- భూర్గుల శ్రీకాంత్, రాయికల్



కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకున్నావారే నిజమైన మిత్రులు మా మిత్రుడు ఆపదలో ఉన్నప్పుడు మేము అండగా నిలవాలని అనుకున్నాం. మిత్రులందరితో కలిసి చర్చించి అందరి సాయంతో డబ్బులు జమచేసి స్నేహితుని కుటుంబ సభ్యులకు అందించాం. కష్టాల్లోని మిత్రునికి స్నేహం నూతన జీవితాన్ని ఇచ్చింది. ఆపదలో ఉన్న మిత్రులకు ప్రతి వ్యక్తి బాధ్యతగా స్పందించాలి.

సాయం అందించడానికి ప్రణాళిక

- కుంబాల శ్రీనివాస్, ఉపాధ్యాయుడు



చిన్ననాటి నుంచి చదువుకున్న మిత్రులకు ఆపదలో సాయపడేందుకు ఆత్మీయ సమ్మేళనంలో ప్రణాళిక ఏర్పాటు చేశాం. మాతో చదివి మాకు దూరమైన మిత్రుల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించేందుకు వారి పిల్లలకు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నాం. మిత్రులను ఆదుకోవడంతో పాటు పాఠశాలకు సాయపడుతున్నాం.

అందరి సహకారంతోనే సాయం

- ఆడెపు మహేష్, రాయికల్



మిత్రులను ఆదుకోవడానికి అందరి మిత్రులను ఏకం చేయడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలనే ఆలోచనతో ముందుకెళ్లి సాయం అందించాం. అడగ్గానే మిత్రులు సాయం అందించడంతో ప్రాణాలు కాపాడగలిగాం. అందరి సహకారంతోనే సాయం అందించడం సాధ్యమైంది. ఆపదలో ఉన్న ప్రతి వ్యక్తిని కాపాడేందుకు మానవత్వంతో ముందుకు రావాలి.

స్వచ్ఛత పక్షోత్సవాల నిర్వహణపై సమావేశం

సెంటినరీకాలనీ, న్యూస్‌టుడే: సింగరేణిలో బుధవారం నుంచి ఈ నెలాఖరు వరకు చేపట్టనున్న స్వచ్ఛ పక్వాడలో (స్వచ్ఛత పక్షోత్సవాల్లో) భాగంగా ఆర్జీ-3,ఏపీఏ సెంటినరీకాలనీలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై జీఎంలు రాజేందర్‌రెడ్డి, వీరారెడ్డి ఆయా విభాగాల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బుధవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో సివిల్, పర్సనల్, పర్యావరణ, ఆయా గనుల అధికారులతో సమావేశమైన జీఎంలు పక్షోత్సవాల్లో భాగంగా యాజమాన్యం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం కాలనీలో, కార్యాలయాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్యం, మొక్కలను నాటే కార్యక్రమాలపై చర్చించారు. 25న సెంటినరీకాలనీలో పారిశుద్ధ్యం పనులను నిర్వహించాల్సి ఉండగా, ఆ రోజు వినాయకచవితి అవుతున్నందున అంతకుముందు రోజు జరిపేందుకు యాజమాన్యం అనుమతి కోసం లేఖను పంపించాలని నిర్ణయించారు. కాలనీలో మురుగు కాలువలను శుభ్రం చేయడం, ఆసుపత్రుల్లో, కార్యాలయాల్లో చెత్తను తొలగింపు చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మొక్కలను నాటటంతో పాటు విద్యార్థులతో పారిశుద్ధ్యం అవగాహన ర్యాలీలను నిర్వహించడం, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలన్నారు. స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని ఆర్జీ-3,ఏపీఏలో విజయవంతం చేసేందుకు కార్మిక కుటుంబాలను సంసిద్ధులను చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి ఓసీపీ-1,2,ఏఎల్‌పీ ప్రాజెక్టు అధికారులు శ్రీనివాసరావు, వీరస్వామి, ఎస్వోటు జీఎం పి.శ్రీనివాసు, నాగేశ్వర్‌రావు, సివిల్, పర్సనల్ అధికారులు నాగేశ్వర్‌రావు, దన్‌పాల్ శ్రీనివాస్, పీఎం నివాస్‌శ్రీనివాస్‌పోత్‌దార్, సీనియర్ పీఓ మారుతి హాజరయ్యారు.



అధికారులతో సమావేశమైన జీఎం విజయ్‌పాల్‌రెడ్డి

స్వచ్ఛపక్వాడను విజయవంతం చేయాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛపక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని జీఎం విజయ్‌పాల్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు బుధవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 31 వరకు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భారీ ఎత్తున మొక్కలను నాటాలని, అందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. దోమలు వ్యాప్తి చెందకుండా వీధులను శుభ్రం చేయాలని, దాని కోసం కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భారీ ప్రదర్శనలు చేపట్టాలని, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. అధికారులు త్యాగరాజు, ప్రసాదరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపైరును పరిశీలించిన శాస్త్రవేత్తలు

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో రైతులు పండిస్తున్న పత్తిపైరును పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు పరిశీలించారు. పత్తిపై పలురకాల సమస్యలు నెలకొన్నట్లు ఏడీఆర్ డాక్టర్ ఎస్.లక్ష్మణ్ తెలిపారు. రసంపీల్చు పురుగులు, పేనుబంక తదితరాలు ఆశించి పంటకు నష్టం కలిగిస్తున్నాయన్నారు. వీటి నివారణకు కాండం పూత పద్ధతిని ఆచరించాలన్నారు. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాము లీటరు నీటికి లేదా ఇమిడాక్లోఫిడ్ 4 మి.లీ మందును 10 లీటర్ల నీటికి వంతున కలిపి పిచికారి చేయాలన్నారు. గులాబీరంగు పురుగుల తాకిడి కూడా ఎక్కువగా ఉన్నందున నివారణకుగాను గుడ్డిపూలను ఏరివేసి లీటరు నీటికి 5 మి.లీ చొప్పున వేపనూనెను కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువున్నపుడు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రాము మందును లీటరు నీటికి వంతున కలిపి పైరుపై పిచికారి చేయాలని రైతులకు సూచించారు.



పరిశీలిస్తున్న ఏడీఆర్ లక్ష్మణ్

జిల్లాకు వర్ష సూచన

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో రానున్న అయిదు రోజుల్లోనూ ఆకాశం పాక్షికంగా మేఘావృతమైఉండి మధ్యస్థ వర్ష సూచన ఉందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం నోడల్ అధికారి డాక్టర్ ఎస్.లక్ష్మణ్ తెలిపారు. హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం అధ్యయనం ప్రకారం జిల్లాలో అయిదురోజుల్లోనూ మొత్తం 60 మి.మీ వరకు వర్షపాతం ఉండన్నారు. నైరుతి దిశనుంచి గంటకు 4-8 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, గాలిలో తేమ 78-88 శాతం వరకు నెలకొంటుందన్నారు. కనిష్ఠంగా 22 డిగ్రీల సెల్సియస్, గరిష్ఠంగా 33 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నెలకొంటాయని వివరించారు.

గుత్తేదారుల లైసెన్స్‌లు రద్దుచేయాలని వినతి

తెలంగాణచౌక్, న్యూస్‌టుడే : కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కస్తూర్బా వసతి గృహాలకు నాణ్యమైన నిత్యావసర సరకులు, వస్తువులు సరఫరా చేయని గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం కరీంనగర్‌లో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. టెండర్లు దాఖలు చేసినపుడు ఇచ్చిన శాంపిల్స్ ప్రకారం వస్తువులు అందించడం లేదని, మార్కెట్‌లో కల్తీ వస్తువులు ఉన్నట్లు నిత్యం పత్రికల్లో వార్తలు వస్తున్నాయని.. వీటితో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. కొంతమంది అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కై నాణ్యతను పరిశీలించడం లేదని వినతిపత్రంలో ఆరోపించారు. వసతిగృహాలకు సరఫరా చేసిన నిత్యావసర వస్తువుల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారోజు రాకేష్, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీసీని నియమించాలి : శాతవాహన విశ్వవిద్యాలయానికి వీసీని నియమించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తంగళపల్లి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం చొరవ చూపడం లేదన్నారు. విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీ లేక రెండేళ్లు అవుతున్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సరిపడా బోధన, బోధనేతర సిబ్బంది లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో శ్రీకాంత్, సాయికుమార్, రామకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తెలంగాణచౌక్, న్యూస్‌టుడే: కరీంనగర్‌ను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో మాత్రం చొరవ చూపడం లేదని తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్ట నరేందర్ అన్నారు. కరీంనగర్‌లో బుధవారం పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. నగరాభివృద్ధిపై నగరపాలక సంస్థ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు కరీంనగర్‌కు వచ్చినప్పుడల్లా నగరాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పడం ఆనవాయితీగా మారిందని ఎద్దేవా చేశారు. కేవలం శంకుస్థాపనలకే పరిమితం అవుతున్నారని, అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలని, అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా నగరం అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా మారిందన్నారు. సంబరాలు జరుపుకోవడం, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తప్ప నగరపాలక సంస్థ చేసిందిశూన్యమని, చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గణేశ్ నవరాత్రోత్సవాలు సమీపిస్తున్నా ఇప్పటివరకు గుంతలను పూడ్చడం, ముందస్తు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో తెదేపా నగర అధ్యక్షుడు కళ్యాడపు ఆగయ్య, నాయకులు ఎ.కమలాకర్, దామెర సత్యం తదితరులు పాల్గొన్నారు.

23న చలో సచివాలయం

భగత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరుతూ.. ఈ నెల 23న చేపడుతున్న చలో సచివాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన గోడప్రతిని బుధవారం కరీంనగర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, దేవమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను వెంటనే ఆపివేయాలి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: ఇసుక రవాణాను తక్షణమే ఆపివేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కే.కే.మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిరిసిల్ల ప్రజలను టీఆర్ఎస్ ప్రభుత్వం అమాయకులను చేసి ఆడుకుంటుందన్నారు. నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులకు పాల్పడిన పోలీసు అధికారులను విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించిందన్నారు. నేరెళ్ల ఘటనలో బాధితులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం జిల్లా ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. ఇసుక లారీల ప్రమాదంలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఇసుక రవాణాను ఆపాలని లేకపోతే అఖిలపక్ష సంఘాలతో చర్చించి గాంధీ యమార్గంలో ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం విఠల్, నంది రమేష్, అంజయ్య ముదిరాజ్, కొత్త రమేష్ గౌడ్, సత్యం, టోనీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కే.కే.మహేందర్‌రెడ్డి

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, న్యూస్‌టుడే : జీహెచ్ఎంసీ ఒప్పంద కార్మికుల తరహాలో నగర, పుర, నగర పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ.. ఈనెల 29, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగిన కార్మిక సంఘాల గుండ్రటి బల్ల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. కార్మికుల వేతనాలు పెంచాలని, జీవోనెం.14 అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ(సీఐటీయూసీ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఏఐటీయూటీయూసీ, టీఎన్‌టీయూ) నిర్ణయించాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 29, 30 లలో టోకెన్ సమ్మె చేయాలని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేయాలని జేఏసీ నిర్ణయించిందన్నారు. సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని, పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులు సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, సీఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఏఐటీయూటీయూసీ, టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శులు పైడిపల్లి రాజు, జిందం ప్రసాద్, సోమమల్లు, సుంకరి తిరుపతి, తిరుపతిలు పాల్గొన్నారు.

మెట్‌పల్లిని హరిత పట్టణంగా మారుద్దాం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ఖాళీ స్థలాలు, ఇళ్లలో విరివిగా మొక్కలు నాటి మెట్‌పల్లిని హరితపట్టణంగా మారుద్దామని పుర అధ్యక్షురాలు మర్రి ఉమారాణి అన్నారు. బుధవారం పురపాలక కార్యాలయంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటిలో ఆరు రకాల మొక్కలు పెంచాలన్నారు. మామిడి, ఉసిరి, దానిమ్మ, జామ, నిమ్మ తదితర పండ్ల మొక్కలు, నీడ నిచ్చే కానుగ మొక్కలు, పూల మొక్కలు అందుబాటులో ఉంచామన్నారు. ఇంటింటికీ పురపాలక సిబ్బంది సరఫరా చేస్తారన్నారు. మొక్కలు తీసుకువెళ్లి పెంపకంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి సహదేవ్, యామ రాజయ్య, గంగనర్సయ్య, గజం రవి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఉమారాణి

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

కరీంనగర్ నేరవార్తలు (తిమ్మాపూర్), న్యూస్‌టుడే: తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.. రామకృష్ణకాలనీలోని ఓ కిరాణంలో గంజాయిని విక్రయిస్తుండగా ఎల్ఎండీ పోలీసులు దాడులు చేశారు.. దాడుల్లో నాలుగు కిలోల గంజాయి పట్టుబడగా.. విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు..? తిమ్మాపూర్ మండలంలో ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు..? కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నారా..? ఎంతమంది గంజాయికి అలవాటు పడ్డారో..? పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

బాధ్యులైన పోలీసులందరిపై చర్యకు డిమాండ్

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : నేరెళ్ల ఘటనలో ఎస్సైతో పాటు బాధ్యులైన పోలీసులందరిపై చర్యలు తీసుకోవాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశం అన్నారు. కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లెలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఘటనపై ప్రభుత్వం ఎస్సైని సస్పెండ్ చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఎస్పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ముందు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు గాజె రమేష్, పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడిపై కేసు

శంకరపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన ఓ యువతితో పెళ్లి నిశ్చయం చేసుకుని తీరా సమయం వచ్చిన తరువాత పెళ్లికి నిరాకరించిన మానకొండూర్ మండలానికి చెందిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.శ్రీను తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మొలంగూర్ గ్రామానికి చెందిన యువతి(25)కు మానకొండూర్ మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన మేర్గు మురళి(30)తో గత జూన్ 14న నిశ్చితార్థం జరిగింది. వివాహం ఆగస్టు 16న ఖరారు చేశారు. ఈ క్రమంలో పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమైన పెళ్లికూతురు కుటుంబ సభ్యులు ఈ నెల 14న పెళ్లి కొడుకు స్వగ్రామానికి వెళ్లగా వారు వివిధ కారణాలు చెప్పి పెళ్లికి నిరాకరించారు. దీంతో బుధవారం వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్న పెళ్లి కూతురు కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. పెళ్లికి నిరాకరించిన యువకుడు మురళి, తల్లిదండ్రులు సావిత్రి, వెంకటస్వామి, చెల్లె అలువాల లాస్య, బావ వేణు, సోదరులు ఆంజనేయులు, శివసాయిలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పది.. ప్రతిభావంతులకు సత్కారం

10, 9.8 జీపీఏలను సాధించిన 51 మంది విద్యార్థులు

ఉత్తమ ఫలితాలు సాధించిన 91 మంది ప్రధానోపాధ్యాయులకు సన్మానం

ఫలితాలను ప్రోత్సహించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయం

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యా విభాగం

జిల్లాలో గత మార్చిలో జరిగిన ఎస్సెస్సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సర్కారు పాఠశాలల్లోని విద్యార్థులు, ఇందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులను జిల్లా యంత్రాంగం సన్మానించనుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ వాటిల్లో ఫలితాల పెంపును ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ నెల 19న కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో 10, 9.8 జీపీఏలను సాధించిన విద్యార్థులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను జిల్లా పాలనాధికారి సర్ఫరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో మంత్రి ఈటల రాజేందర్ చేతుల మీదుగా సత్కరించేలా జిల్లా విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. మొత్తం 51 మంది విద్యార్థులు, 91 మంది ప్రధానోపాధ్యాయులను సత్కరించబోతున్నారు.

మాట నిలుపుకొంటున్న పాలనాధికారి : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ప్రోత్సహిస్తున్న ప్రధానోపాధ్యాయులను జిల్లా యంత్రాంగం తరపున ఘనంగా సన్మానిస్తామని గతేడాది జిల్లా పాలనాధికారి పాఠశాలలను సందర్శించిన సమయంలో చెప్పుకొచ్చారు. గతంలో లేని విధంగా గతేడాది జిల్లాలో పది ఫలితాలను పెంచేందుకు ప్రత్యేక దృష్టి నిలిపిన ఆయన ప్రభుత్వ పాఠశాలలను జిల్లాస్థాయి అధికారులకు దత్తత కల్పించారు. ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలువడం విశేషం.. పాఠశాలల్లో చెప్పినట్లుగానే ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని సత్కరించే కార్యక్రమాన్ని చేపడుతూ సర్కారు బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు స్ఫూర్తిని నింపేలా పాలనాధికారి సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాటను నిలబెట్టుకోవడం జిల్లాలోని ఉపాధ్యాయుల్లో సంతోషాన్ని నింపుతోంది.



విద్యార్థుల పరీక్షలకు సన్నద్ధాన్ని పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి సర్ఫరాజ్ అహ్మద్(దాచిన చిత్రం)

మంత్రి చేతులమీదుగా : గత మార్చిలో జరిగిన ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యం పరిధిలోని విద్యా సంస్థల్లో 10, 9.8 జీపీఏలను సాధించిన విద్యార్థులను జిల్లా యంత్రాంగం సత్కరిస్తోంది.. ఈ పరీక్షకు జిల్లా నుంచి 15,424 మంది విద్యార్థులు హాజరవగా, 14,422 మంది ఉత్తీర్ణత సాధించి 93.73 ఉత్తీర్ణత శాతంతో జిల్లా రాష్ట్రంలో ఫలితాల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రభుత్వ, జడ్పీ, ఆదర్శ పాఠశాలలతో పాటు కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలకు చెందిన మొత్తం 16 మంది విద్యార్థులు 10 జీపీఏలను సాధించారు. అలాగే 35 మంది విద్యార్థులు 9.8 జీపీఏలను అందుకున్నారు. వీరికి రూ.800 విలువ చేసే పుస్తకాలు, జ్ఞాపికతో సత్కరించనున్నారు. అలాగే వంద శాతం ఫలితాలు సాధించిన ఆయా పాఠశాలల 56 మంది ప్రధానోపాధ్యాయులకు సన్మానం, 9.8 జీపీఏను సాధించిన 35 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జ్ఞాపికలను అందించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సత్కార కార్యక్రమంలో మంత్రి రాజేందర్, పాలనాధికారి సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొంటారని డీఈవో రాజీవ్ తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఈ సమాచారాన్ని అందించి వారు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు సదరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

యాజమాన్యం	100% ఫలితాల పాఠశాలలు	9.8 జీపీఏ విద్యార్థులు	10 జీపీఏ విద్యార్థులు
ప్రభుత్వ	1	1	1
కేజీబీవీ	4	0	0
ఆదర్శ	4	20	10
జడ్పీ	45	7	0
రెసిడెన్షియల్	2	5	2
ఎయిడెడ్	0	2	3

జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపిక

ధర్మపురి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ధర్మపురి మండలం తుమ్మెనాల గ్రామానికి చెందిన మామిడిపెల్లి గణేశ్ ఎంపికయ్యాడు. ధర్మపురిలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న గణేశ్ ఈ నెల 13న హైద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-22 పోటీల్లో 50 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచాడు. పాయింట్ ఫైట్ విధానంలో బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 6 నుంచి 13వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్నాడు. ఈ సందర్భంగా గణేశ్‌ను కళాశాల ప్రిన్సిపల్ లింగమూర్తి, అధ్యాపకులు అభినందించారు.



గణేశ్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

నేటి నుంచి మీజిల్స్, రూబెల్లా టీకాలు

ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు రవికుమార్

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు మీజిల్స్ రూబెల్లా టీకాలిచ్చే కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్రస్థాయి పరిశీలకులు రవికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో టీకాల శిబిరాల నిర్వహణ ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2,52,770 మంది తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలున్నారని వీరికి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిర్దేశించిన సమయానుకూలంగా టీకాలు ఇప్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 2376 శిబిరాలుంటాయని ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్త, ఉపాధ్యాయునితో కూడిన బృందం శిబిరంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. టీకాలకు సంబంధించిన వైద్య సామగ్రి తోపాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. శరత్ టీకాల కార్యక్రమం స్థానిక పురాతన ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. అంతకుముందు జిల్లా ఆసుపత్రి నుంచి క్యాంపు వరకు ఎంఆర్ టీకాల అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక అధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారిణి సుగంధిని, డాక్టర్ సమియొద్దీన్ ఆయన వెంట ఉన్నారు.



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

ప్రతిభ

ముఖ్యమైన తేదీలు

- ★ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోస్టులకు: *9* సెప్టెంబరు
- ★ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు: *12* సెప్టెంబరు
- ★ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, లెక్చరర్ పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు: *15* సెప్టెంబరు

1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు



టీఎస్‌పీఎస్‌సీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు తీపి కబురు ప్రకటించింది. మొత్తం 2345 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ కింద ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం మొదలైన వివరాలు..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మొత్తం ఖాళీలు: 1857

వయసు: 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉండాలి.

వేతన శ్రేణి: రూ.16,400 - 49,870

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరం.

- ★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.

  పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.

  పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
- ★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు

- ★ మొత్తం ఖాళీలు: 205.
- ★ విభాగాల వారీగా ఖాళీలు: అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 41, పీడియాట్రిక్స్ - 27, అనెస్తీషియా - 39, ఆర్థోపెడిక్స్ - 5, ఈఎన్‌టీ - 20, డెర్మటాలజీ - 1, పాథాలజీ - 16, జనరల్ మెడిసిన్ - 34, సైకియాట్రిక్ - 3, రేడియాలజీ - 3, జనరల్ సర్జరీ - 16.
- ★ అర్హత: సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ/ డిప్లొమా లేదా తత్సమాన అర్హత అవసరం.
- ★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
- ★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: పేపర్ - 1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
  - ✪ పేపర్ - 2లో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి అనే రెండు విభాగాలు ఉంటాయి. సెక్షన్ - ఎలో బేసిక్ యూజీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు (అందరికీ కామన్). సెక్షన్ - బిలో సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
  - ✪ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
- ★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

- ★ మొత్తం ఖాళీలు: 90
- ★ అర్హత: అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా ఏదైనా డిగ్రీ లేదా బోటనీ/ ఫారెస్ట్రీ/ హార్టికల్చర్/ జువాలజీ/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జియాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా కెమికల్/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ★ వయసు: 18 నుంచి 31 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ★ వేతన శ్రేణి: రూ.21,230 - 63,010
- ★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.

  పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.

  పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
- ★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయి.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

- ★ మొత్తం ఖాళీలు: 67.
- ★ అర్హత: అగ్రికల్చర్/ బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజినీరింగ్ (అగ్రికల్చర్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ వెటర్నరీ సైన్స్/ జువాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ★ వయసు: 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ★ వేతన శ్రేణి: రూ.31460 - 84970
- ★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: జనరల్ ఇంగ్లిష్ పేపర్ (100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100), మ్యాథమెటిక్స్ పేపర్ (ఎస్ఎస్‌సీ/ హయ్యర్ స్కూల్ స్టాండర్డ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100)లో సాధించిన మార్కులను క్వాలిఫయింగ్ మార్కులుగా పరిగణిస్తారు. 150 మార్కులకు జనరల్ స్టడీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. ఆప్షనల్ పేపర్‌లో (ఏదైనా ఒకటి మాత్రమే) 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మరో 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- ★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
- ★ చివరి తేదీ: 12 సెప్టెంబరు

ట్యూటర్

- ★ మొత్తం ఖాళీలు: - 65
- ★ విభాగాల వారీగా ఖాళీలు: క్లినికల్ - 33. ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
- ★ నాన్ - క్లినికల్ - 32. ఎంబీబీఎస్/ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. (మెడికల్ స్పెషాలిటీ విభాగాల్లో)
- ★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఉద్యోగాలు

- ★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
- ★ పేపర్ - 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
- ★ పేపర్ - 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
- ★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
- ★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో.
- ★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు

- ★ మొత్తం ఖాళీలు: 43.
- ★ అర్హత: ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
- ★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,780
- ★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.

  పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. సమయం: రెండున్నర గంటలు, మార్కులు 150.

  పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు: 300. వ్యవధి: రెండున్నర గంటలు.
- ★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
- ★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు

- ★ మొత్తం ఖాళీలు: 10.
- ★ అర్హత: బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ స్టేట్ డెంటిస్ట్స్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌లో లేదా ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలి.
- ★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
- ★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు.

  పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 150.

  పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో డెంటల్ సర్జరీకి సంబంధించి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
- ★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
- ★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
- ★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

లెక్చరర్లు

- ★ మొత్తం ఖాళీలు: 6
- ★ విభాగాలు: రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిస్ట్
- ★ అర్హత: ప్రథమశ్రేణి మార్కులతో ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- ★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ★ వేతన శ్రేణి: రూ. 37,100 - 91,450
- ★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.

  పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.

  పేపర్ – 2: పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా స్థాయిలో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్‌కు సంబంధించి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
- ★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
- ★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

- ★ ఖాళీలు: 2
- ★ అర్హత: ఫిజియోథెరపీలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ★ వేతన శ్రేణి: రూ.17,890 - 53,950
- ★ ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
- ★ పరీక్షా విధానం: మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి.

  పేపర్ 1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు 150. సమయం: రెండున్నర గంటలు.

  పేపర్ 2: ఫిజియోథెరపీ (డిప్లొమా స్థాయిలో) నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు 150.
- ★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: www.tspsc.gov.in

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✪ ఖాళీలు: హిస్టరీ, ఆర్కియాలజీ - 1.
- ✪ తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజెస్ - 1.
- ✪ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ - 1.
- ✪ సోషియాలజీ, సోషల్ వర్క్ - 1.
- ✪ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఛైర్ - 1.
- ✪ జువాలజీ - 1.
- ✪ బోటనీ, మైక్రోబయాలజీ - 1.
- ✪ మ్యాథమెటిక్స్ - 1.
- ✪ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ - డీన్ - 1.
- ✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ✪ పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 'రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాగార్జున నగర్ - 522510, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్' పేరిట ఎస్‌బీఐలో తీసిన రూ.2 వేల డీడీ జతచేసి పంపాలి.

చివరి తేదీ: 9 సెప్టెంబరు

వెబ్‌సైట్: www.anu.ac.in

బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✪ వివరాలు: ఆర్ట్స్: ప్రొఫెసర్ (లా - 1, సోషల్ వర్క్ - 1)
- ✪ సైన్స్: ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ - 1, మ్యాథమెటిక్స్ - 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 1).
- ✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ✪ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000

చివరి తేదీ: *29 ఆగస్టు*

✪ **వెబ్‌సైట్: www.brau.edu.in**

ఐఐఎం, విశాఖపట్నం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయనుంది.

- ✪ ఖాళీలు: అకౌంటెంట్ -1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) - 1, జూనియర్ ఇంజినీర్ -1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫో అసిస్టెంట్ - 1, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్ - 1.

వెబ్‌సైట్: www.iimv.ac.in

IBPS - RRBs Recruitment


No. of Questions: 80 | Maximum Marks: 80 | Time: 45 Mts.

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

(37 – 39):




37. I. ✔ II. ✔
Both I and II follows.

38. I. ✔ II. ✕
Only I follows.

39. I. ✕ II. ✕
Neither I nor II follows.

40.



I. ✕ II. ✔
Only II follows.

41. 8×20 men = 8×32 women
$\Rightarrow$ 5 men = 8 women
5 men + 8 women = 16 women
$M_1D_1 = M_2 D_2$
$\Rightarrow 8 \times 32 = 16 \times D_2$
$\Rightarrow D_2 = \frac{8 \times 32}{16} = 16$ days

42. Side of the square
$= \sqrt{1024} = 32$ cm.
∴ Length of rectangle
$= 2 \times 32 = 64$ cm.
Breadth of rectangle = 32 – 12 = 20 cm.
∴ Required ratio = 64 : 20 = 16 : 5

43. x + x + 2 + x + 4 + x + 6 + x + 8 = 220
$\Rightarrow$ 5x + 20 = 220 $\Rightarrow$ x = 40
Second lowest number of different set
$= 2 \times 40 - 37 = 43$
∴ Required sum
= 42 + 43 + 44 + 45 + 46 = 220

44. Bus fare = Rs. 420
Train fare $= 2 \times 420 \times \frac{3}{4}$ = Rs. 630
∴ Required total fare
= Rs. $(2 \times 420 + 4 \times 630)$ = Rs. (840 + 2520)
= Rs. 3360

45. Speed of tractor $= \frac{360}{12} = 30$ kmph
Speed of jeep $= 30 \times \frac{250}{100} = 75$ kmph
∴ Speed of car $= \frac{3}{5} \times 75 = 45$ kmph
∴ Average speed of car and jeep together
$= \left(\frac{75 + 45}{2}\right)$ kmph = 60 kmph

46. Gita's average earnings
$= \frac{140 + 200 + 420 + 400}{4} = \frac{1160}{4}$ = Rs. 290

47. Amount earned by Rahul and Naveen
= 180 + 260 + 340 + 160 = Rs. 940

48. Naveen's total earnings on Wednesday
= 420 + 120 = Rs. 540

49. Required difference = 240 – 200 = Rs. 40

50. Required ratio = 360 : 120 : 160
= 9 : 3 : 4

51. It is obvious from the table.

52. Percentage increase in 2006
$= \frac{-12.5 - 5.3}{5.3} \times 100 = 136$

53. Required difference
$= (14.5 - 6.6) \times 1000$ = Rs. 7900

54. Total monthly rent at Virar over the years
$= (1.1 + 2.1 + 1.8 + 3.6 + 5.5 + 7.8) \times 1000$
= Rs. 21900
∴ Required percentage $= \frac{9800}{21900} \times 100 = 45$

55. It is obvious from the table.

56. I. $5x^2 - 18x + 9 = 0$
$\Rightarrow 5x^2 - 15x - 3x + 9 = 0$
$\Rightarrow 5x(x - 3) - 3(x - 3) = 0$
$\Rightarrow (x - 3)(5x - 3) = 0$
∴ x = 3 or $\frac{3}{5}$

II. $20y^2 - 13y + 2 = 0$
$\Rightarrow 20y^2 - 8y - 5y + 2 = 0$
$\Rightarrow 4y(5y - 2) - 1(5y - 2) = 0$
$\Rightarrow (4y - 1)(5y - 2) = 0$
∴ $y = \frac{1}{4}$ or $\frac{2}{5}$
Clearly, x > y

57. I. $x^3 = 878 + 453 = 1331$
∴ $x = \sqrt[3]{1331} = 11$
II. $y^2 = 82 + 39 = 121$
∴ $y = \sqrt{121} = \pm 11$
∴ $x \geq y$

58. I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$
$\Rightarrow 3 + 4 = x \Rightarrow x = 7$
II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$
$\Rightarrow y^{7/2} = 7^{7/2} \Rightarrow y = 7$
∴ x = y

59. I. 9x – 4x = 54.55 + 15.45
$\Rightarrow$ 5x = 70 $\Rightarrow$ x = 14
II. $\sqrt{y + 155} = 7 + 6 = 13$
$\Rightarrow$ y + 155 = 169
$\Rightarrow$ y = 169 – 155 = 14
∴ x = y

60. I. $x^2 + 11x + 30 = 0$
$\Rightarrow x^2 + 6x + 5x + 30 = 0$
$\Rightarrow x(x + 6) + 5(x + 6) = 0$
$\Rightarrow (x + 5)(x + 6) = 0$
∴ x = – 5 or – 6
II. $y^2 + 7y + 12 = 0$
$\Rightarrow y^2 + 4y + 3y + 12 = 0$
$\Rightarrow y(y + 4) + 3(y + 4) = 0$
$\Rightarrow (y + 3)(y + 4) = 0$
∴ y = – 3 or – 4
Clearly, x < y

61. The pattern of the number series is :
$7 \times 2 + 6 = 20$; $20 \times 2 + 6 = 46$
$46 \times 2 + 6 = 98$
$98 \times 2 + 6 = 202$
$202 \times 2 + 6 = 404 + 6 =$ 410

Send your feedback to
pratibhadesk@eenadu.net

62. The pattern of the number series is :
$210 - 1^3 = 209$
$209 + 2^2 = 213$
$213 - 3^3 = 186$
$186 + 4^2 = 202$
$202 - 5^3 = 202 - 125 =$ 77

63. (5) The pattern of the number series is :
27 + 11 = 38
38 + 33 = 71
71 + 55 = 126
126 + 77 = 203
203 + 99 = 302

64. (3) The pattern of the number series is :
$435 - 9 \times 9 = 354$
$354 - 9 \times 8 = 282$
$282 - 9 \times 7 = 219$
$219 - 9 \times 6 = 165$
$165 - 9 \times 5 =$ 120

65. (3) The pattern of the number series is :
$4 + 14^2 = 4 + 196 = 200$
$200 + 13^2 = 200 + 169 = 369$
$369 + 12^2 = 369 + 144 = 513$
$513 + 11^2 = 513 + 121 = 634$
$634 + 10^2 = 634 + 100 =$ 734

Calculations (66 – 70):
∴ 25% = 75
∴ 100% $= \frac{75}{25} \times 100 = 300$
∴ Total females = 300
Computer Science $\Rightarrow \frac{300 \times 35}{100} = 105$
Civil Engineering $\Rightarrow \frac{300 \times 5}{100} = 15$
Electrical Engineering $\Rightarrow \frac{300 \times 20}{100} = 60$
Mechanical Engineering $\Rightarrow \frac{300 \times 15}{100} = 45$
Bio-technology = 75
Total males = 700 – 300 = 400
Computer Science $\Rightarrow \frac{400 \times 30}{100} = 120$
Civil Engineering $\Rightarrow \frac{400 \times 15}{100} = 60$
Electrical Engineering $\Rightarrow \frac{400 \times 18}{100} = 72$
Mechanical Engineering $\Rightarrow \frac{400 \times 12}{100} = 48$
Bio-technology $= 400 \times \frac{25}{100} = 100$

66. Required percent $= \left(\frac{100 - 75}{75}\right) \times 100$
$= \frac{100}{3} = 33\frac{1}{3}$ %

67. Required ratio = 120 : 105 = 8 : 7

68. Required difference
= 72 + 48 – 60 – 45 = 15

69. Civil Engineering + Computer Science :
Total students = 105 + 15 + 120 + 60 = 300
Male students = 180
∴ Required percent $= \frac{180}{300} \times 100 = 60$

70. Required average
$= \frac{45 + 75 + 48 + 100}{2} = \frac{268}{2} = 134$

71. ? = 466 + 765 – 212 = 1019
∴ Required answer = 1020

72. ? $= \frac{150 \times 150}{100} + 150$
= 225 + 150 = 375

73. ? $= \frac{300 \times 750}{1000} - 1400$
= 2250 – 1400 = 850

74. ? = 51 – 34 + 21 = 38
∴ Required answer = 40

75. ? $= \frac{900}{30} \times \frac{90}{300} \times \frac{600}{50} = 108$
∴ Required answer = 110

76. C.P. of wrist watch
$= \frac{100}{100 - \text{loss\%}} \times$ S.P.
= Rs. $\left(\frac{100}{75} \times 2400\right)$ = Rs. 3200
∴ Required S.P. of wrist watch =
Rs. $\left(\frac{125}{100} \times 3200\right)$
= Rs. 4000

77. Fifth number
$= 5 \times 56 - 4 \times 54 = 280 - 216 = 64$

78. Let the number be x.
∴ $x + \frac{7}{9} \times \frac{35}{100} \times 900 = 325$
$\Rightarrow$ x + 245 = 325
$\Rightarrow$ x = 325 – 245 = 80

79. x + 4x + 5x + 60 = 360"
$\Rightarrow$ 10 x = 300° $\Rightarrow$ x = 30
∴ Required difference = 5x – x
$= 4x = 4 \times 30 = 120"$

80. On dividing 1740 by 88,
the remainder = 68
∴ Required number = 68.

This model paper was prepared by subject experts of RACE Institute, Hyderabad

హాయ్! బుజ్జీ!!

మన జీవిత లక్ష్యం ఆనందం కాదు, దానికి తగిన అర్హత సంపాదించుకోవడం

– ఎమర్సన్




పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- push = తోయు
- మకరం = మొసలి

కొండల్లో ఇల్లంట.. ప్రపంచంలో మిన్నంట!!

ప్రపంచంలో ఎత్తయిన ఆకాశహర్మ్యం ఏదంటే... బుర్జ్‌ఖలీఫా అని ఠక్కున చెప్పేస్తాం. మరి ప్రపంచంలో ఎత్తయిన ఇల్లేదంటే చెప్పగలరా? తెలియకపోతే ఇది చదివేయాల్సిందే.



- మనం పది పదిహేను అంతస్తులుండే అపార్ట్‌మెంట్లు బోలెడు చూస్తుంటాం. అందులో చాలా కుటుంబాలు నివాసముంటాయి. అయితే ప్రపంచంలో ఒకే కుటుంబం ఉండే ఎత్తయిన ఇల్లొకటుంది. పేరు 'ఫాల్కన్ నెస్ట్'.
- అమెరికాలో ఆరిజోనా రాష్ట్రం ఉంది. అక్కడన్నీ చాలామటుకు రాతి కొండలు. అలాంటి చోటుందీ ఇల్లు.
- ఇది 6,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 10 అంతస్తుల్లో ఉన్న దీని ఎత్తు 124 అడుగులు. అంటే ఓ పన్నెండు అంతస్తుల అపార్ట్‌మెంట్ అంత.
- ఈ ఇంట్లోంచి 360 డిగ్రీల్లో చుట్టూ ఏ ప్రదేశమైనా చక్కగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆరిజోనా పక్క రాష్ట్రం కాలిఫోర్నియాలోని పర్వతాలు సైతం ఈ ఇంట్లోకి కనిపిస్తాయి. దీని నిర్మాణమే ఆ రకంగా చేశారన్నమాట.
- ఇంత పెద్ద ఇంట్లో బోలెడన్ని పడకగదులు ఉంటాయనుకుంటారేమో. దీంట్లో ఉన్నది మూడు పడకగదులు, నాలుగు బాత్రూమ్‌లే. మిగిలిన స్థలమంతా బయటి ప్రకృతి అందాలు ఎక్కడికక్కడ కనిపించేలా అద్దాలతో ఉంటుంది.
- ఇల్లు వేసవిలో చల్లగా, శీతకాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంది.
- దీని యజమాని ఎంతో ఇష్టంతో 1994లో దీన్నిలా కట్టించుకున్నారు. ఆయన భార్య చనిపోవడంతో ఇప్పుడు దీన్ని అమ్మకానికి పెట్టారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఇల్లు అమ్మకానికి వచ్చిందంటూ ఇది ఇప్పుడు మళ్లీ వార్తల్లోకొచ్చింది.

కథ

నోటు పాట్లు!

ఒక అరటి పండ్లు అమ్మే వాడి డబ్బుల డబ్బాలోకొచ్చి పడిందో పది రూపాయల కాగితం. సరికొత్తగా మెరిసిపోతోంది. అయితే దాని ముఖంలో విచారం పరుచుకుని ఉంది.

ఆ డబ్బాలో ఉన్న మిగతా డబ్బు కాగితాలు, నాణేలు మొదట ఈ కొత్త నేస్తాన్ని కుతూహలంగా చూశాయి. దాని దిగులు ముఖం చూసి ఏమైందని అడిగాయి.

"ఊహ తెలిసినప్పటి నుంచి ఒక ఇనుప పెట్టెలో ఊపి రాడక బతికాను. ఈ రోజు ఒక షావుకారు దయవల్ల బయట పడ్డాను. ఊపిరి పీల్చుకోబోయానో లేదో అతగాడు నన్ను ఒక బిచ్చగత్తె జోలెలో పడేశాడు. ఆమె దగ్గరున్న సొట్టలు పడిన సత్తు గిన్నెలోకి చేరుకున్నాను. అలాంటి చోట బతకాలంటే ఎంత కంపరమనిపించిందో. ఇంతలో ఆమె అరటిపండ్లు కొనడంతో మళ్లీ ఈ పెట్టెలో కొచ్చి పడ్డాను. మళ్లీ చీకటి, ఇరుకు, ఉక్కపోత. ఇక్కడి నుంచి ఎవడి చెమట జేబులోకి వెళ్తానో, వాడు నన్ను ఎవరి పరం చేస్తాడో, ఇలా ఎన్ని చేతులు మారాలో తలుచుకుంటేనే గాబరాగా ఉంది". అని వాపోయింది.

పక్క డబ్బులన్నీ దీని వాలకానికి నిరుత్సాహ పడ్డాయి. ఇక దాని జోలికి పోకుండా తమలో తాము కబుర్లాడుకోసాగాయి.

ఇంతలో ఆ పెట్టెలోకి చేరింది మరో పది కాగితం. చాలా ముడతలు పడి మురికిగా, చిరగడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. అయితే దాని ముఖం కళకళలాడుతోంది. వచ్చిన కాసేపటికే అన్ని రకాల డబ్బులనూ నవ్విస్తూ వాటికి మంచి నేస్తమయిపోయింది.

ఈ కొత్త కాగితాన్ని కూడా పలకరించింది. కానీ అది నవ్వలేదు సరికదా! మరింత ముఖం ముడుచుకుని 'మాసిపోయిన నీ వాలకం చూస్తుంటే కొన్నాళ్లకి నా గతీ ఇంతేనేమో అని ఏడుపొస్తోంది' అంది దీనంగా.


నవ్వుతూ వింటున్న పాత నోటుని నీకథేమిటంది ఆగలేక.

'మొదట నేనూ కొన్నాళ్లపాటు ఇనపపెట్టెలో ఊపిరాడకుండానే ఉన్నాను. కానీ ఒక కుటుంబానికి భద్రతనిస్తున్నాననే ఆనందంతో బాధ అనిపించలేదు. ఈ రోజు ఒక చెప్పులు కుట్టే మనిషి చేతికి వచ్చాను. ఇందాక అతను తన వణుకుతున్న చేతులతో చెమటతో తడిచిన జేబులోంచి నన్ను తీసి ఇచ్చి అరటిపళ్లు కొని ఒకటి ఆత్రంగా తిన్నాడు. అతని ఆకలి తీర్చగలిగాననే ఆనందం ఎంత బాగుందో! ఎందరివో చెమట, మురికి అంటుకుని ఇలా అయిపోయాను. నా జీవితంలో ఎన్ని మలుపులో! ఎన్ని మజిలీలో! అయినా నాకు అడుగడుగునా ఆనందమే'. చెబుతున్న పాత నోటును ఒక చెయ్యి పైకి లాగింది.

'మరెవరి అవసరమో తీర్చే అవకాశం మళ్లీ వచ్చింది నాకు. టాటా' అని వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయింది పాత నోటు.

అసలైన ఆనందం తారసపడిన పరిస్థితుల్ని బట్టి కాదు, అలవరుచుకున్న వైఖరిని బట్టి ఉంటుందని తెలుసుకుంది కొత్తనోటు. దాని మనసు కలత తీరి తేటపడింది.

- గుడిపూడి రాధికారాణి





ధ్రువ ప్రాంత ఎలుగుబంట్లు వాసన చూడటంలో మహా దిట్టలు. ఆహారం మంచులో దాగి ఉన్నా ఇవి 20 మైళ్ల దూరం నుంచే పసిగట్టేస్తాయి.

నవ్వుల జల్లులు!



టీచర్: హోం వర్కులో ఎవరైనా తప్పులు చేస్తే వాళ్లకు రేపు గట్టిగా దెబ్బలు పడతాయి...

చింటు: అయితే రేపు మా అన్నను తప్పకుండా తీసుకొస్తాను టీచర్!

- జీవీయస్ ప్రియంవద, అరసవెల్లి

భార్య: ఏవండీ నేనీరోజు గారెలు చేశాను...

భర్త: అయితే పళ్ల డాక్టరు అపాయింట్‌మెంట్ తీసుకొస్తాను..

భార్య: ఎందుకండీ?

భర్త: అవి తిన్నా, తినకపోయినా తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు కాబట్టి!



- అంజి, చౌడేపల్లి

జతపరచండి!

ఇక్కడ సినిమా పేర్లు అసంపూర్ణంగా ఉన్నాయి. పక్కనున్న పదాల్లో ఏది సరిపోతుందో కనిపెట్టి జత చేయగలరా?


1. స్వామి	ఎ. కోరి
2. ఇట్లు	బి. వేడుక చూద్దాం
3. రారండోయ్	సి. రారా
4. నిన్ను	డి. శ్రావణి సుబ్రమణ్యం

చిలిపి ప్రశ్న

రాత్రిళ్లు కూడా పగలు కనిపించేదెప్పుడు?

- ఎ. వెంకట అమ్మిరాజు, పేరూరు

దారేది?



గబగబా అనండి

నత్త నడక చిరుత ఉరక

- ఎం.సాయిచేతన్, హైదరాబాద్

ఎవరు నేను?

నేను ఏడక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలో 1,3,6,7 అక్షరాలు కలిపితే పద్యం అని అర్థం, 2,3,5,6– పాత్ర, 7,3,4– గుంపు అని అర్థం. ఇంతకీ నేనెవరిని?

1	2	3	4	5	6	7

ఏది భిన్నం?



జవాబులు: చిలిపి ప్రశ్న: కలగన్నప్పుడు! ఏది భిన్నం: C జతపరచండి: 1.సి 2.డి 3.బి 4.ఎ ఎవరు నేను: Problem

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

తెలంగాణచౌక్, న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. కేంద్ర గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఇందులో భాగంగా కరీంనగర్‌లో విధులు బహిష్కరించి ప్రధాన తపాలా కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏఐజీడీఎస్‌యూ ప్రతిపాదించిన సవరణలతో పాటు, కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటలు పని కల్పిస్తూ, సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం జీడీఎస్‌లకు పెన్షన్ మంజూరు చేయాలని, లక్ష్యం(టార్గెట్) పేరుతో బలవంతం చేయడం, వేధించడం మానుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సేవింగ్ ఖాతాలు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ చెల్లింపులు లాంటి సేవలు గ్రామీణ తపాలా కార్యాలయాల ద్వారానే జరుగుతున్నాయని, జీడీఎస్ ఉద్యోగులను మాత్రం చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉండి మృతి చెందిన ఉద్యోగుల అంత్యక్రియలకు ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లించాలని, ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ఎలాంటి షరతులు లేకుండా ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని యూనియన్ నాయకులు దాసరి కృష్ణ తెలిపారు.



ప్రధాన తపాలా కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన**, 06-30: **అన్నదాత**, 07-00: **ఈటీవీ న్యూస్**, 07-30: **శుభమస్తు:** శిరిడిసాయి అనుగ్రహం కోసం గురువారం పాటించాల్సిన నియమాలు...?, ఇంట్లో ఉండాల్సిన లక్ష్మీప్రదమైన వస్తువులు.., 08-30: **టాలీవుడ్ టైమ్**, 09-00: **ఈనాడు సినిమా: జగన్మోహిని** (నరసింహరాజు, ప్రభ).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమఘుమలు **'చెనా బీట్‌రూట్ మసాలా'**, మీచేతి వంట **'పాలక్‌పకోడీ కర్రీ', 'బీరకాయ బొబ్బర్ల కర్రీ'**, జస్ట్ ఎ మినిట్ **'క్యాబేజ్ శాండ్‌విచ్'** తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2)** (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్–2**(రిపీట్), 05-30: **ఆడాళ్ళా మజాకా:** (రావులపాలెం అతివల అల్లరి ఆటల సందడి), 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్**, 09-30: **జబర్దస్త్** (ఖతర్నాక్ కామెడీ షో): వినోదాల విందు... 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డీజే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డీజే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ.3:00, రా. 09:00)
జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ.09:30, మ.2:00, సా.04:00, రా. 7:00)
బాడీ మైండ్ & సోల్ - **సుఖ జీవనం** (ఉ.10:00, మ.2:30, రా. 9:30).
విహారి (మ.12:00, సా.6:30, రా. 10:00)
హెల్దీ డయాబెటిక్ (మ.1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగల దోపిడి (కృష్ణ, దీప), 10-00: **మార్నింగ్ షో: అమ్మో బొమ్మ** (రాజేంద్ర ప్రసాద్, ఉమా శంకరి), మధ్యాహ్నం: 1-00: **మాట్నీ:** వంశానికొక్కడు (బాలకృష్ణ, ఆమని), సాయంత్రం: 4-00: **ఈవినింగ్ షో: దేవా ది గ్రేట్** (సత్యరాజ్, భానుప్రియ), **రాత్రి:** 7-00: **ఫస్ట్ షో: పంతాలు – పట్టింపులు** (శోభన్‌బాబు, వాణిశ్రీ), 10-00: క్రియేటివ్ డైరెక్టర్ **కృష్ణవంశీతో** గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఎగ్ ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ సలాడ్, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో –** ఓట్స్ అండ్ వెజిటబుల్ బాత్ & ఓట్స్ లీఫీ అండ్ ఆలూ పరోటా, **ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు –** చల్ల ఉండలు & స్వీట్ పనియారం, **ఉ.11.00, రా.10.45: గోరుముద్దలు –** మంగుళూర్ బన్స్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ –** పాలక్ రాజ్మా కర్రీ, **ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్"** - సగ్గుబియ్యం పెరుగు వడలు & టమోట రోటి పచ్చడి, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (గోవన్ – హిందు క్యూసైన్)** - గోవన్ కోకోనట్ కేక్, **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ –** పాలకాయలు, **మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - పొట్లకాయ వడ కర్రీ, **మ.12.45: సూప్స్ & స్టార్టర్స్** - ఆచారి రోస్టెడ్ చికెన్, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) –** ఆహాతీర్ తుకా హష్య & బోహేమనియన్ డ్రెస్సింగ్, **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - శెనగల బిళ్ళల కర్రీ, **మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ –** తెరియాకి చికెన్, **మ.2.30: చోటా షెఫ్ –** ఎగ్ పకోడి, **సా.5.15: స్నాక్స్ –** టమాటో పాస్తా.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **కడుపులో సునామీ... సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సుజాతానగర్, విశాఖపట్నం**, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ**, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ సాయిబాబా మందిరం, దేశ్‌ముఖ్, రంగారెడ్డి జిల్లా, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **కడుపులో సునామీ...** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ**, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 17-08-2017

SVBC TTD — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగళు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రీపీట్), **సాయంత్రం:** 04-30 అష్టలక్ష్మి అనుగ్రహం శ్రీ మాచిరాజు కిరణ్, 05-00 లైవ్ ఎస్.డి.సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + లక్ష్మీ నృసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం..

భక్తి TV — **ఉదయం:** 06-00 సాయిహారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీ వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 05-30 సాయిగీతామృతం, 06-00 సద్గురుస్తోత్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Zee తెలుగు — **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: రెడీ, 11-00 కామెడీ ఖిలాడీలు (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడీ ఖిలాడీలు, 05-00 జైకృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: **తులసి.**

maa — **ఉదయం:** 06-30 సిల్వర్‌స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 దిన ఫలం - రాశి ఫలాలు, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: **నమో వెంకటేశ**, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, 04-00 సినిమా: ఊహలు గుసగుసలాడే, **సాయంత్రం:** 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్ .

GEMINI — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ముగ్గురు మొనగాళ్ళు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: పందెంకోడి, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు,10-00 సినిమా: శౌర్యం.

జొన్న సాగులో మెలకువలు



జొన్నను ఖరీఫ్ పంటగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో విత్తుకోవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి హారిక తెలిపారు. నల్లరేగడి, తేలికైన ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయన్నారు.

రకాలు: సి.ఎస్.హెచ్-5, 6, 9, 13, పి.ఎస్.హెచ్-1, ఎ.ఎస్.హెచ్-1, పి.ఎస్.వి-1, సి.ఎస్.వి-15, నంద్యాల తెల్లజొన్న 3, ఎన్.జె -2169, ఎ.జె-140 తీపిజొన్న రకాలు విత్తవచ్చు. 105 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 15-20 కింటాళ్ల దిగుబడి వస్తుంది. సి.ఎస్.హెచ్ 5, 6, 9, 13 రకాల్లో కంకి కండె ఆకారంలో ఉండి బూజు తెగులు తట్టుకొంటాయి. అంతర పంటలను వేసుకోవచ్చు. ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. చొప్ప ఎక్కువగా వస్తుంది. కాండం తొలుచు పురుగును కొంత వరకు నివారిస్తుంది. గింజ తెల్లగా ఉంటుంది.

విత్తనం: ఎకరాకు 4 కిలోలు సరిపోతుంది.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే ఎడం : వరుసల మధ్య 45 సెం.మీ, వరుసలో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి.

ఎరువులు: పశువుల ఎరువు ఎకరాకు 4 టన్నులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరాన్ని విత్తేటప్పుడు, పంట మోకాలు ఎత్తు పెరిగినప్పుడు.. 12 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

నీటి యాజమాన్యం : తేలిక నేలల్లో వారానికి ఒకసారి, నల్లరేగడి భూముల్లో 15 రోజులకొకసారి తడి ఇవ్వాలి. పంట పూత, గింజ పాలు పోసుకునే సమయంలో నీరు తప్పకపెట్టాలి.

అంతర పంటలు : జొన్న, కందిలను 2:1 నిష్పత్తిలో వేసుకోవచ్చు.

అంతరకృషి : విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వల్ల పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసేయాలి. విత్తిన తదుపరి కలుపు నివారణకు.. ఎకరాకు కిలో పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 3 రోజుల్లోపు పిచికారి చేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో 2, 4-డి ఎకరాకు 800 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్

కనకాంబరానికి పురుగుల బెడద



కనకాంబరంలో పురుగుల బెడద ఎక్కువని ఉద్యాన అధికారి ఎం.బబిత తెలిపారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు.

నులి పురుగులు: ఇవి మొక్కల వేర్లకు రంధ్రాలు చేసి బుడిపెలను కలుగజేస్తాయి. దీని వల్ల వేర్లు నీటిని, పోషకాలను కావాల్సిన మేర మొక్కకు అందించలేవు. అందు వల్ల ఆకులు ముడుచుకుని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారతాయి. పూల పరిమాణం తగ్గుతుంది. నులి పురుగులు చేసిన రంధ్రాల గుండా శిలీంధ్రాలు వేర్లలోకి చేరి ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలు ఎండిపోతాయి.

నివారణ చర్యగా నులిపురుగులున్న పొలంలో కనకాంబరం పూలసాగు చేపట్టే ముందు, సూర్యరశ్మీకరణ చేయాలి. నాటేముందు ఎకరాకు 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగు కిలోల ఫోరేట్ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకతో కలిపి చల్లాలి. నులిపురుగులు సోకిన మొక్కల్ని పెరికి నాశనం చేయాలి. బంతి పూలతో పంటమార్పిడి చేస్తే నేలలో నులిపురుగుల సంఖ్య తగ్గుతుంది.

పిండినల్లి: లేత కొమ్మలు, ఆకులు, పూమొగ్గలపై తెల్లని పొర కప్పినట్టుగా ఉండే పురుగులు గుంపులుగా చేరి రసంపీల్చడంతో ఆకులు పసుపురంగుకు మారి మొక్కలు గిడసబారతాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని బూజు పెరుగుతుంది. దీని వల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ జరగక మొక్కల పెరుగుదల తగ్గుతుంది. నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపిన ద్రావణాన్ని రెండుసార్లు 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన నారు నాటడం లేదా సాగుచేసిన పొలంలో శిలీంధ్రాలు ఉండటం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఈ శిలీంధ్రానికి నులి పురుగులు తోడైనప్పుడు మొక్కలు తొందరగా ఎండిపోతాయి. ఆకులు ముందుగా కిందికి వాలుతాయి. తరువాత పసుపు రంగుకు మారి కొమ్మల చివర్లు కిందికి వంగుతాయి. మొదట వేర్ల చివర్ల వద్ద తర్వాత నేల మట్టం వద్ద కాండం కుళ్లిపోతుంది. దీన్ని కాండంకుళ్లు అంటారు. లీటరు నీటికి 3 గ్రా. కాంటాఫ్ కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ భూమి తడిచేలా పోసి ఎండు తెగులును నివారించవచ్చు.

సమస్యల నిలయాలు... మైనార్టీ గురుకుల పాఠశాలలు

అద్దె భవనాలు.. అరకొర వసతులు.. నీటికి కటకట


కోరుట్ల పట్టణం, న్యూస్‌టుడే:

మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నూతనంగా గురుకుల పాఠశాలను ప్రవేశపెట్టింది. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకుల పాఠశాలలు అద్దె భవనంలోనే ఏర్పాటు చేశారు. లక్షల్లో అద్దె చెల్లిస్తున్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల భవనాల్లో పూర్తిస్థాయి వసతి సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థల మధ్య విద్యాభ్యాసం, వసతి కొనసాగిస్తున్నారు. అద్దె భవనాలు , పడక మంచాల కొరత, సరిపోని మూత్రశాల, మరుగుదొడ్లు, పందుల బెడద, నీటి సమస్యలతో కాలం వెళ్లదీస్తూ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి లలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలపై 'న్యూస్‌టుడే' కథనం..

జగిత్యాల జిల్లా కేంద్రంలో మైనార్టీ బాలికల, బాలుర గురుకుల పాఠశాలలు, ధర్మపురిలో బాలికల, కోరుట్ల ,మెట్‌పల్లిలో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలున్నాయి. 2016 జూన్‌లో కోరుట్ల బాలుర, జగిత్యాల బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలలు ప్రారంభించారు. జగిత్యాల, మెట్‌పల్లిలో బాలుర, ధర్మపురిలో బాలికల గురుకుల పాఠశాలలను 2017 జూన్‌లో ప్రారంభించారు. ఇందులో పట్టణ, పరిసరాల గ్రామాలకు చెందిన మైనార్టీలతో పాటు ఎస్టీ, ఎస్సీ , బీసీ , ఇతర వర్గానికి చెందిన విద్యార్థులు ప్రవేశం కల్పించారు. 75 శాతం మైనార్టీ , 25 శాతం నాన్ మైనార్టీలతో తరగతికి 80 మంది చొప్పున సీట్లు కేటాయించి విద్యార్థులను చేర్చుకున్నారు. కోరుట్ల బాలుర, జగిత్యాల బాలికల గురుకుల పాఠశాలలో 5 నుంచి ఎనిమిది మిగతా వాటిలో 5 నుంచి 7 తరగతులు చేపడుతున్నారు. ఇందులో కోరుట్ల బాలురలో 290, జగిత్యాల బాలికలలో 320, జగిత్యాల బాలురలో 180, ధర్మపురి బాలికలలో 120, మెట్‌పల్లి బాలురలో 140 మంది ప్రవేశం పొందారు.



జగిత్యాలలో అద్దె భవనంలో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల



మెట్‌పల్లి మైనార్టీ గురుకులంలో మూలన పడక మంచాల సామాగ్రి

గురుకుల పాఠశాలలు అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ఇందులో పూర్తిస్థాయి మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు అవస్థల మధ్య విద్యాభ్యాసం, వసతి కొనసాగిస్తున్నారు. కోరుట్ల గురుకుల పాఠశాల పైకప్పు శిథిలమయ్యాయి. దీంతో వర్షం కురిసిన సమయంలో పైకప్పు నుంచి వర్షంనీరు గదుల్లోకి వస్తోంది. కొన్ని కిటికిలకు అద్దాలు పగిలిపోవడంతో వర్షపు జల్లులు, క్రిమి కిటకాలు లోపలికి వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. కొంతమంది విద్యార్థులకు కీటకాలు కుట్టగా దద్దుర్లతో కూడిన గాయాలయ్యాయి. భవనాల ప్రహరీకి ముందస్తుగా రక్షణగా జాలీలు (గ్రిల్స్) ఏర్పాటు లేకపోవడంతో అపాయం పొంచి ఉంది. గత ఏడాది ప్రారంభించిన గురుకుల పాఠశాలలలో పాత విద్యార్థులకు మాత్రమే పడక మంచాలున్నాయి. ఈ ఏడాది నూతన గురుకుల పాఠశాలలకు పడక మంచాలను సరఫరా చేస్తున్నారు. పాత గురుకుల పాఠశాల వాటిల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు పడక మంచాలు లేవు. దీంతో జూన్ నుంచి ఇప్పటికి విద్యార్థులు నేలపై నిద్రిస్తున్నారు. ఈ ఏటా కోరుట్ల బాలుర, జగిత్యాల బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి ప్రారంభం కాగా ఆ తరగతి గదులకు డెస్కు బెంచీలు సరఫరా చేపట్టలేదు.

తాగునీటి సమస్య

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి గురుకుల పాఠశాలలో నీటి సమస్య కొంత వరకు ఉంది. ఆర్‌వో సిస్టం శుద్ధజల కేంద్రం ఏర్పాటులో జాప్యం నెలకొంది. దీంతో నిర్వాహకులు తాత్కాలికంగా బయట నుంచి తాగునీటి బాటిళ్లు తెప్పించుకుంటున్నారు. వాహనాల ద్వారా నీరు సరఫరా చేస్తేనే విద్యార్థులకు అందే పరిస్థితి నెలకొంది.

కోరుట్ల గురుకులంలో బోరు లేదు. దీంతో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా రోజూకు పది నుంచి 12 వరకు ట్రిప్పుల నీరు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికి విద్యార్థులకు స్నానాలకు, మూత్రశాల, మరుగుదొడ్ల నిర్వహణ , వంట చేయడానికి తగినంత నీరు సరిపోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. నీటి ఎద్దడితో ఆర్‌వో ప్లాంట్ అలంకారప్రాయంగా మారింది. కోరుట్ల గురుకులంలో నీటి సరఫరా కోసం నెలకు 80 వేల నుంచి లక్ష వరకు ఖర్చు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పరిసరాలు దుర్వాసన.. పందుల బెడద

అన్ని గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూత్రశాల మరుగుదొడ్లు లేవు. కోరుట్ల గురుకుల పాఠశాలలో కేవలం పది మాత్రమే మూత్రశాల, మరుగుదొడ్లులున్నాయి. విద్యార్థులకు సరిపోడం లేదు. వీటి పరిశుభ్రత చర్యలకు తగినంత నీటి సౌకర్యం లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోంది. ఆవరణలో పందులు సంచారంతో అపరిశుభ్రత నెలకొంది. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మైనార్టీ అధికారులు చెబుతున్నారు.



కోరుట్లలో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల

సరఫరా చేయని కాస్మోటిక్ కిట్

గురుకులంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతకు కాస్మోటిక్ కిట్‌లను ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో టూత్‌పేస్టు, షాంపులు, దువ్వెనలు, పౌడర్‌డబ్బాలు, వాసిలిన్ , బట్టల సబ్బు, స్నానం సబ్బులు, బ్రెష్‌లుంటాయి. కాని ఈ ఏటా కాస్మోటిక్ కిట్‌లను గురుకులాలకు ఇప్పటికి సరఫరా చేయలేదు. దీంతో విద్యార్థులు బయట కొనుగోలు చేస్తున్నారు.

తాత్కాలిక సిబ్బందితోనే సరి

మైనార్టీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసినప్పటికి ఇందులో శాశ్వత నియమకాలు చేపట్టలేదు. ప్రతి గురుకుల పాఠశాలలో బోధన సిబ్బందిలో తెలుగు, హిందీ, ఉర్దూ, ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్, పీఈటీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, , స్టాఫ్ నర్సు, బోధనేతర సిబ్బందిలో వార్డెన్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీసు సబార్డినేటర్, హౌజ్ కీపింగ్(3), సెక్యూరిటీ గార్డులు (2), ప్లంబర్, ఎలక్ట్రీషియన్‌లను పొరుగు సేవల పద్ధతిలో నియామకం చేసుకున్నారు. దీంతో తాత్కాలిక సిబ్బందితో బోధన, వసతి నిర్వహిస్తున్నారు. కొంత మంది భోదనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు స్థానికంగా ఉండడం లేదని ఆరోపణలున్నాయి. అలాగే విద్యాహక్కు చట్టం ప్రకారం తల్లిదండ్రుల కమిటీల ఏర్పాటు లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం:



ఎండి మహ్మాద్‌అలీ అఫ్సర్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ పర్యవేక్షకులు

గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పడక మంచాలు, ఫర్నిచర్, సామాగ్రి సరఫరా చేపడుతాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. అద్దె భవనాల యజమానులతో మరమ్మతు పనులు చేయాలని ఆదేశిస్తాం. కాస్మోటిక్ కిట్‌లు రాగానే అందిస్తాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండా చూస్తున్నాం. సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించేలా చూస్తాం.

ఎదిగితేనే రక్షణ..



హరితహారం కార్యక్రమంతో ప్రతి సారి మొక్కలు నాటుతున్నా మేకలు తినడం, ఎండిపోవటంతో మళ్లీమళ్లీ నాటాల్సి వస్తోంది.. చిన్నపాటి మొక్కలు ఎదగాలంటే కనీసం రెండేళ్లైన కావాలి.. ఇందుకు పరిష్కారంగా ఎదిగిన వాటినే నాటితే సమయం ఆదాతోపాటు మూడు నాలుగు నెలలు వాటిని కాపాడితే నీడనివ్వడమేకాక ఎత్తుగా ఉంటంతో మేకలు కూడా తినవని గుర్తించిన మున్సిపల్ అధికారులు ఏపుగా పెరిగిన మొక్కలనే కొనుగోలు చేశారు. రూ.200లకు ఓ మొక్కను మెదక్ నుంచి ప్రత్యేకంగా తెప్పించారు. రహదారి వెంట నాటేందుకు కొత్త బస్టాండు మున్సిపల్ ట్యాంకు వద్ద సిద్ధంగా ఉంచారు.. 1000కిపైగా తెప్పించిన ఈ మొక్కలు రహదారి వెంట నాటనున్నారు.

-జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే



గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: వేములవాడలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలకు ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రధానాచార్యుడు జి.అశోక్ తెలిపారు. ఇందులో భాగంగా బీఎస్సీ ఎంపీసీఎస్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ ఎంబీజడ్సీ కోర్సుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 17, 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిజ ధ్రువీకరణ పత్రాలు, రెండు సెట్ల నమూనా కాపీలు, రెండు పీపీ ఫొటోలతో తక్షణ ప్రవేశాలకు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 94908 64547, 94910 64515 చరవాణిపై సంప్రదించాలని చెప్పారు.